సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
సోమవారం, 04.05.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 192
పేజీలు: 08 వెల: రూ. 5


# పట్టపగలే కాల్పులు

పీఎంజే జ్యువెలరీలో భారీ దోపిడీ



- ఐదుగురు దుండగుల దాడి..
- జ్యువెలరీలో కోట్ల దోపిడీ
- అడ్డుకొంటే కాల్పులు.. నలుగురు సిబ్బందికి తీవ్రంగా గాయాలు
- సీసీటీవీలో రికార్డ్ అయిన దొంగల దౌర్జన్యం..
- పోలీసుల గాలింపు వేగం
- రద్దీ ప్రాంతంలో దాడి.. భద్రతపై పెద్ద ప్రశ్నలు

**ముద్ర, కరీంనగర్ :**
కరీంనగర్ నగరంలో పట్టపగలు జరిగిన దారుణ ఘటన స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. నగరంలోని కరీంనగర్ జ్యోతినగర్ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పీఎంజీ షాపులో ఐదుగురు దొంగలు తుపాకులతో దూసుకెళ్లి కాల్పులు జరిపి భారీ దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో నలుగురు సిబ్బందికి తీవ్ర గాయాలవగా, కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు సమాచారం.
సాక్షుల కథనాల ప్రకారం, మధ్యాహ్న సమయంలో రెండు బైకులపై వచ్చిన ఐదుగురు దుండగులు ఒక్కసారిగా షాపులోకి చొరబడ్డారు. లోపలికి వెళ్లిన వెంటనే తుపాకులు చూపించి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారు. కౌంటర్లలో ఉన్న బంగారు నగలను సేకరిస్తుండగా, కొంత మంది సిబ్బంది అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దొంగలు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో నలుగురు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స మిగతా 02లో

## చిప్ప చేతిలో పట్టుకొని తిరుగుతున్నారు

హైదరాబాద్ వచ్చి మళ్లీ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నరు
చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



- కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ సర్కార్ మనుగడ
- రాష్ట్రంలో రైతు బతికి ఉన్నాడంటే కేంద్ర ప్రభుత్వమే కారణం
- నిధుల లేవని సీఎం ఒప్పుకున్నారు

03

## ఐపీఎల్ టికెట్ల దందా..

నకిలీ లేఖలతో ఐపీఎల్ టికెట్ల దందా.. ముఠా అరెస్ట్

- అక్రమ విక్రయాలపై ఆపరేషన్..
- జడ్జీలు, అధికారుల పేర్లు చెప్పి టికెట్లు దక్కించుకునే ప్రయత్నం
- ఎచ్‌సీఏ అప్రమత్తం.. సంయుక్త ఆపరేషన్‌తో ముఠా అరెస్ట్
- అదుపులో ప్రధాన నిందితుడు

03




## ఇండ్ల కేటాయింపులో రాజకీయాలు వద్దు

కూసుమంచి ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి

- ప్రజా దర్బార్‌లో వినతుల వెల్లువ..
- మే ఆఖరులోగా రెండో విడత పారదర్శక పాలనకు కట్టుబాటు

03



## రామగుండం కోల్ మైన్ కు అనుమతులు

2 ఓసీ గనులు, 3 భూగర్భగనుల బొగ్గు నిల్వల తవ్వకం కోసం
రూపొందించిన విశిష్ట ప్రాజెక్టు

- 314.98 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సద్వినియోగమే లక్ష్యం
- ఏడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి
- 25 ఏళ్లపాటు కొనసాగనున్న తవ్వకాలు

02

# మద్యం ధరల పెంపు!?

## కసరత్తు చేస్తోన్న ప్రభుత్వం..

ఈ నెలలోనే కమిటీ కీలక భేటీ

- పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు ఊపందించిన ప్రభుత్వం
- గ్యాస్, ముడిసరకుల ధరల పెరుగుదలే ప్రధాన కారణం
- డిస్టిలరీల ఒత్తిడితో నిర్ణయం దిశగా అడుగులు
- సాధారణ బ్రాండ్లపై రూ.60 వరకు పెంపు అవకాశం
- ప్రీమియం, టాప్ బ్రాండ్లపై రూ.120కిపైగా పెంపు సూచనలు
- ధరల పెంపుతో తెలంగాణ ఖజానాకు భారీగా అదనపు ఆదాయం
- త్వరలోనే ప్రతిపాదనలపై ఆమోదం




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ రాష్ట్రంలో మద్యం ప్రియులకు చేదు వార్త. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న మద్యం ధరల పెంపు ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నుంచి అందుతున్న సమాచారం మేరకు ఈ నెలలోనే ధరల పెంపుపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. కేవలం ప్రభుత్వ ఆదాయమే కాకుండా, అంతర్జాతీయ పరిణామాలు కూడా ఈ ధరల పెంపునకు ప్రధాన కారణంగా మారుతున్నాయి. మిగతా 02లో



## కవిత పదికోట్లు అడిగితే కేసీఆర్ ఇవ్వద్దన్నారు!

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు
కేఏ పాల్

03

- కవిత పార్టీతో ఎవరికీ ఎలాంటి లాభం లేదు
- తన ఆస్తులను కాపాడుకునేందుకే కవిత ఆరాటం

## బండ్ల గణేష్ కుమార్తె నిశ్చితార్థం



- పశ్చిమ గోదావరి యువకుడు సూర్య తేజతో
- వేడుకకు వెంకయ్య నాయుడు, నారా చంద్రబాబు దంపతులు హాజరు
- మెగాస్టార్ చిరంజీవి సహా సినీ ప్రముఖుల సందడి
- రాఘవేంద్రరావు, బ్రహ్మానందం, కోన వెంకట్ తదితరుల ఆశీస్సులతో వేడుక వైభవంగా నిర్వహణ

04



# నిరాశ నిరీక్షణ

## తెగని ఆశల్లో క్యాబినెట్ విస్తరణ

- ఐదు రాష్ట్రాల ఫలితాలు
- కేరళలో సీఎం తేలిన తర్వాతే తెలంగాణ ఫోకస్
- ఇప్పటికే పెరిగుతున్న ఆశావహులు జాబితా
- ఢిల్లీ, బెంగళూరు కు చక్కర్లు
- రాజగోపాలరెడ్డిదీ తీరని లోటు
- ఏ క్షణం ఏం జరుగుతుందోననే టెన్షన్స్
- విస్తరణ కోసం కాంగ్రెస్ వాదనలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
క్యాబినెట్ విస్తరణకు కాంగ్రెస్ లో వివాదమే రేపుతోంది. ఇప్పుడు విస్తరణ.. త్వరలో ఖాయం అంటూ సంకేతాలు ఇస్తూనే సమయం దాటవేస్తున్నారు. దీనికి తోడు మంత్రి పదవి వస్తుందని ఆశలు పెట్టుకుంటున్న వారి జాబితా పెరిగిపోతోంది. ఆశావహులు అటు ఢిల్లీకి.. ఢిల్లీ పైరవీ కోసం బెంగళూర్ కు చక్కర్లు కొడుతున్నారు.
తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. మంత్రివర్గం నుంచి కొందరిని తొలగించే అవకాశం ఉండగా.. కొత్త వారికి సైతం కేబినెట్ లో అవకాశం లభించనుంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, ముఖ్యంగా కేరళలో యూడీఎఫ్ కూటమికి మెజార్టీ వస్తే అక్కడ సీఎం పదవి తేల్చిన తరువాత కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళన, విస్తరణపై ఫోకస్ చేయనుందని తెలుస్తోంది. మిగతా 02లో

# ఐదు రాష్ట్రాల తీర్పు

## నేడే ఓట్ల లెక్కింపు.. పకడ్బందీ భద్రత



- కమలం వికసించేనా? దీదీ పాగా వేసేనా?
- తొలి మూడు గంటల్లోనే ట్రెండ్స్ తెలిసే అవకాశం
- బెంగాల్లో దీదీతో కమలనాథుల హోరాహరీ పోరు
- తమిళనాడులో డీఎంకే, ఎన్డీఏ కూటమి మధ్య పోటీ
- కేరళలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ మధ్య టగ్ ఆఫ్ వార్
- అసోం, పుదుచ్చేరిలో ఎన్డీఏకు ఎడ్జ్

**ముద్ర డెస్క్ :**
దేశ కీలకమైన ఐదు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కౌంట్ డౌన్ డౌన్ రాష్ట్రాలు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మే 4 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలు దేశ వ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.
మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఒకేసారి ఓట్ల లెక్కింపు జరగనుండగా, తొలి మూడు గంటల్లోనే ట్రెండ్స్ స్పష్టమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నానికి మెజార్టీపై స్పష్టత రాగా, సాయంత్రం పూర్తి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.
రాష్ట్ర వారీగా పోటీ తీవ్రంగా కొనసాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్య హోరాహోరీ పోరు. తమిళనాడులో ద్రవిడ మున్నేట్ర కజగం, ఎన్డీఏ కూటమి మధ్య పోటీ ఏర్పడింది. కేరళలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ మధ్య పోటీ కొనసాగుతుండగా, మిగతా 02లో

ఇదీ AI
ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 04.05.2026
www.mudranews.in | @mudranews



**ఈతపండ్లు : శక్తి కోసం ఉత్తమం**



ఈతపండ్లు తక్షణ శక్తి ఇస్తాయి. అలసట, నిస్సత్తువ తగ్గించడానికి బాగా ఉపయోగపడతాయి.

# నిరాశ..నిరీక్షణ




(మొదటిపేజీ తరువాయి)

**కొత్తగా ఇద్దరు.. పాతోళ్ళ మార్పులు**

ప్రస్తుతం ఉన్న ఖాళీల్లో మరో ఇద్దరు నేతలను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకునేందుకు వీలుంది. ఇందులో ఒక స్థానాన్ని ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించే ఛాన్స్ ఉండటంతో రేసులో బాలూనాయక్, రామచంద్రునాయక్ వంటి నాయకులు ఉన్నారు. మంత్రి పదవి తమనే వరిస్తుందని దీమాగా ఉన్నారు. అయితే రామచంద్రునాయక్‌ను గత ఏడాది డిప్యూటీ స్పీకర్ పోస్టుకు ఖరారు చేసినప్పటికీ శాసనసభలో ఇంకా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయలేదు. ఇక మరో మంత్రి పదవి బెర్త్ కోసం పలువురు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలకే అధిష్ఠానం ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో సీనియర్ నేతలు, పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించే వారి పేర్లను సైతం కాంగ్రెస్ అధిష్టానం పరిశీలించనుంది. కొందరు మంత్రుల వ్యవహారశైలిపై ప్రజల్లో అసంతృప్తి ఉన్నందున పార్టీకి సైతం డ్యామేజ్ జరగకూడదని వారిని మార్చాలని రేవంత్ సూచించే అవకాశాలున్నాయి.

**నిజామాబాద్ జిల్లాకు మంత్రి పదవి?**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి తెలంగాణ క్యాబినెట్‌లో ప్రాతినిథ్యం లేదు. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, సీతక్క మంత్రులుగా ఉన్నారు. నిజామాబాద్ నుంచి సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతం క్యాబినెట్ హోదాలో ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారు. ఆయనను మంత్రిగా తీసుకుంటారా లేక ఇదే జిల్లాకు చెందిన పీసీసీ చీఫ్, రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు అయిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి దక్కుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే రేవంత్ మాత్రం మహేష్‌గౌడ్‌ను పార్టీ పరంగానే ప్రయోజనం కోసం పీసీసీ అధ్యక్షుడిగానే కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి విజయం సాధించాలంటే మహేష్ గౌడ్ లాంటి నేత పార్టీ సారథిగా ఉండాలని రేవంత్ భావిస్తున్నారు.

**రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తారా?**

మంత్రి పదవి కోసం చాలా మంది రేసులో ఉన్నప్పటికీ ప్రత్యేకంగా వినిపించే పేరు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మునుగోడు ఎమ్మెల్యే తనకు ఖచ్చితంగా అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. అయితే ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటం మైనస్ అవుతోంది. కుటుంబం నుంచి ఒకే మంత్రి పదవి ఇవ్వాలని, రెండు పదవులు ఇవ్వకూడదని కాంగ్రెస్ హైకమాండ్ అభ్యంతరం తెలుపుతోంది. రేవంత్ రెడ్డి అధిష్టానంతో మాట్లాడి ఒప్పించడం అంత ఈజీ కాదని వినిపిస్తోంది. వీరితో పాటు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, మదన్‌మోహన్ రావు, రామ్మోహన్ రెడ్డి కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. ప్రేమ్ సాగర్ రావుకు క్యాబినెట్ హోదాలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. కానీ ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు.

**శాఖల ప్రక్షాళన సైతం**

మంత్రివర్గ విస్తరణతో పాటు కొన్ని కీలక శాఖల్లో మార్పులు జరగనున్నాయని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డికి అదనపు బారంగా మారిన కీలకమైన హోం శాఖ బాధ్యతను ఒక సీనియర్ మంత్రికి అప్పగిస్తారని పార్టీలోనూ వినిపిస్తోంది. ఇప్పటికే విద్యాశాఖ మంత్రిగా రేవంత్ ఉన్నప్పటికీ.. టెన్త్, ఇంటర్ ఫలితాలు ప్రభుత్వ సలహాదారు కేశవరావు విడుదల చేశారని తెలిసిందే. కేరళ ఎన్నికల ఫలితాల తర్వాతే తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళనపై కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. కనుక కేబినెట్ విస్తరణకు మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

# పట్టపగలే కాల్పులు..

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ దోపిడీ జరిగిన ప్రదేశం కోర్టు సర్కిల్ సమీపంలోని శివా థియేటర్ లైన్‌గా ఉండటం, ఆ ప్రాంతం ఎప్పుడూ జనసంచారం ఎక్కువగా ఉండటం గమనార్హం. అలాంటి రద్దీ ప్రాంతంలో ఈ స్థాయిలో ప్లాన్ చేసి దోపిడీ జరగడం పోలీసులకే సవాల్‌గా మారింది. దొంగలు ముందుగానే షాపును టార్గెట్ చేసి, పూర్తి ప్రణాళికతో వచ్చారని అనుమానిస్తున్నారు.

ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. షాపులో ఉన్న సీసీటీవీ కెమెరాలు మొత్తం ఘటనను రికార్డ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసులు ఆ ఫుటేజ్‌ను విశ్లేషిస్తూ నిందితుల గుర్తింపుపై దృష్టి సారించారు. దొంగలు పారిపోయిన మార్గాలను గుర్తించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను సేకరిస్తున్నారు.

పోలీసులు నగరంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 'నిందితులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తాం. దోపిడీకి గురైన ఆభరణాలను కూడా తిరిగి స్వాధీనం చేసుకుంటాం' అని అధికారులు తెలిపారు.

ఈ ఘటనతో నగరంలోని ఇతర జ్యూవెలరీ వ్యాపారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆయుధాలతో వచ్చి కాల్పులు జరిపి దోపిడీ చేయడం వంటి ఘటనలు అరుదుగా జరుగుతాయి. దీంతో భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల తెలంగాణలోని ఇతర నగరాల్లో కూడా జ్యూవెలరీ షాపులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, ఇది ఆర్గనైజ్డ్ క్రైం నెట్‌వర్క్ పని కావచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సాధారణ ప్రజల్లో కూడా భయం నెలకొంది. 'మేము కష్టపడి సంపాదించిన డబ్బుతో నగలు కొనుగోలు చేస్తాం. ఇలాంటి ఘటనలు జరిగితే షాపులకు వెళ్లడానికే భయపడాల్సి వస్తుంది' అని ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని భద్రతను బలోపేతం చేయాలని డిమాండ్ వినిపిస్తోంది.

# రామగుండం కోల్ మైన్‌కు పర్యావరణ అనుమతులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

సింగరేణి సంస్థ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వినూత్నమైన రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ ఇటీవల ప్రాథమిక అనుమతుల మంజూరుకు అంగీకారం తెలిపింది.. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ నుండి సింగరేణి యాజమాన్యానికి సందేశం ఇచ్చింది. మరో పది రోజుల్లో అనుమతి పత్రాలు రానున్నాయి. సంస్థ సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి మార్గనిర్దేశంలో డైరెక్టర్లు, అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించడం విశేషం. సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా ఏడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యంతో రూపొందించిన ఈ వినూత్న ప్రాజెక్టుకు ప్రాథమిక పర్యావరణ అనుమతులు లభించడంతో సింగరేణి యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

మూతపడుతున్న పాత గనుల ఉత్పత్తిని భర్తీ చేయడానికి, ఇప్పటికే కనీస అనుమతులు ఉన్న 2 ఓపెన్ కాస్ట్ గనులు, 3 భూగర్భ గనుల పరిధిలోని బొగ్గును ఇంకా తవ్వి తీయటానికి అనువుగా ఉన్న 314.98 మిలియన్ టన్నుల నిల్వలను ఉత్పత్తి చేయడానికి ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గు ప్రధానంగా సమీపంలోని ఎన్టీపీసీ రామగుండం వారికి, ఇతర బొగ్గు ఆధారిత పరిశ్రమలకు ఇంధన సరఫరా ఒప్పందం ప్రకారం సరఫరా చేయనున్నారు.

**ప్రకృతి వరమైన బొగ్గును గరిష్టంగా వెలికి తీయడమే లక్ష్యం**

మూతపడిన జీడీకే-10 ఇంక్లైన్, మూతపడనున్న వకీల్ పల్లి భూగర్భ గనులను ఓపెన్ కాస్ట్ గనులుగా మార్చి అక్కడ మిగిలి ఉన్న బొగ్గును సంపూర్ణంగా వెలికి తీయడంతో పాటు, ఈ గనులకు ఆనుకొని ఉన్న రామగుండం ఓపెన్ కాస్ట్-1 విస్తరణ ప్రాజెక్టు ఫేజ్ 2, రామగుండం ఓపెన్ కాస్ట్-2 విస్తరణ ప్రాజెక్టు, అడ్రియాల షాఫ్ట్ అండర్ గ్రౌండ్ విస్తరణ ప్రాజెక్టుల అంచుల్లో మిగిలిన బొగ్గును కూడా గరిష్టంగా వెలికి తీయడం కోసం, వీటన్నింటినీ కలిపి రామగుండం కోల్ మైన్ అనే ఒక విశిష్ట ప్రాజెక్టుకు కంపెనీ రూపకల్పన చేశారు. ఇప్పటికే ఉన్న అనుమతులను సద్వినియోగం చేస్తూ తక్కువ పెట్టుబడులతో, పర్యావరణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా దీన్ని తయారు చేశారు. మూతపడుతున్న గనుల ఉత్పత్తిని భర్తీ చేసుకోవడంతో పాటు ఈ గని రామగుండం రీజియన్ కు మరో 25 ఏండ్ల జీవిత కాలాన్ని అందించనుంది.

**ఈ విశిష్టతల ప్రాజెక్టు వివరాలు...**

సాధారణంగా భూగర్భంలో బొగ్గు తవ్వకం అయిపోయిన తర్వాత కూడా కొంతమేర బొగ్గు గనిలో మిగిలిపోతుంది. ప్రకృతి వరప్రసాదమైన బొగ్గును ఈ విధంగా వదిలివేయకుండా సద్వినియోగం చేసుకోవడం కోసం సింగరేణి సంస్థ గతంలో మూతపడిన భూగర్భ గనుల ప్రదేశంలో ఓపెన్ కాస్ట్ గనులను ప్రతిపాదించి అనుమతులు సాధించి బొగ్గు తవ్వకాలు విజయవంతంగా నిర్వహించింది. వీటిలో కొత్తగూడెంలోని గౌతమ్ ఖని ఓపెన్ కాస్ట్ గని, మణుగూరులో మణుగూరు ఓపెన్ కాస్టు గని మరికొన్ని ఓసీ గనులతో పాటు తాజాగా కొత్తగూడెంలోని వీకే కోల్ మైన్ ను పేర్కొనవచ్చు. ఇదే తరహాలో రామగుండం-1 ఏరియాలో మూతపడిన జీడీకే-10 ఇంక్లైన్ గనిలో మిగిలి ఉన్న 56.79 మిలియన్ టన్నుల బొగ్గు, రామగుండం-2 ఏరియాలో త్వరలో మూతబడనున్న వకీల్ పల్లి గనిలో మిగిలి ఉండే 28.99 మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయడం కోసం అక్కడ ఓపెన్ కాస్ట్ తరహా మైనింగ్ జరపాలని యోచించింది. దీంతో పాటు ఈ 2 గనులకు ఆనుకొని ఉన్న రామగుండం ఓపెన్ కాస్ట్-1 విస్తరణ ప్రాజెక్టు ఫేజ్-2కు మధ్య సరిహద్దు ప్రాంతంలో రక్షణ నిమిత్తం వదిలేసిన 25.98 మిలియన్ టన్నుల బొగ్గు, ఇంకా ఈ గనులకు పక్కన అటు ఇటు ఉన్న బొగ్గు నిల్వలు 3.90 మిలియన్ టన్నులు, రామగుండం ఓపెన్ కాస్ట్-2 విస్తరణ ప్రాజెక్టు, అడ్రియాల షాఫ్ట్ అండర్ గ్రౌండ్ విస్తరణ గనుల సరిహద్దు తలాల వద్ద మిగిలి ఉన్న బొగ్గును కూడా ఈ ప్రాజెక్టు కిందనే తవ్వి తీయాలని నిర్ణయించింది. ఇందులో ఓపెన్ కాస్ట్ గనుల ప్రాంతం నుండి 182.28 మిలియన్ టన్నుల బొగ్గు, భూగర్భ గనుల ప్రాంతం నుండి 132.70 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉత్పత్తి చేయనున్నారు. ఇక్కడి సగటు బొగ్గు గ్రేడు జీ-10 గా గుర్తించబడింది. ఈ మొత్తం 5 గనుల పరిధిలోని బొగ్గును తవ్వడం కోసం ఇప్పటికే ఉన్న అనుమతులకు అదనంగా మరికొన్ని అనుమతులను సాధించాలని నిర్ణయించి రామగుండం కోల్ మైన్ అనే పేరుతో ఒక కొత్త ప్రాజెక్టు రూపుదిద్దుకుంది.

**ప్రాజెక్టు ఎలా ప్రారంభమవుతుంది?**

ముందుగా మూతపడిన జీడికే-10 ఇంక్లైన్ భూగర్భ గనిని ఓపెన్ కాస్ట్ గనిగా మారుస్తారు. దీనిని ఓపెన్ కాస్ట్-1 గనిని ముందుకు కొనసాగిస్తూ షావెల్-డంపర్ పద్ధతిలో తవ్వుతూ వెళ్తారు. ఈ క్రమంలో వచ్చే ఓవర్ బర్డెన్ మట్టిని ప్రస్తుతం ఆర్.జి ఓసీ-1ఎక్స్ టెన్షన్ ఫేజ్-2లో బొగ్గు తవ్వగా ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో నింపుతూ వస్తారు. ఇలా జీడీకే-10 ఇంక్లైన్ ప్రాంతంలోని బొగ్గు తవ్వకానికి ఎనిమిదేళ్లు పడుతుంది. ఆ తర్వాత వకీల్ పల్లి గనిని ఓపెన్ కాస్ట్ గనిగా మారుస్తారు. ఈ క్రమంలో వకీల్ పల్లి ఓపెన్ కాస్ట్ గని ప్రాంతం నుండి వచ్చే ఓవర్ బర్డెన్ మట్టిని అప్పటికే తవ్వకం పూర్తయిన జీడీకే-10 ఇంక్లైన్ క్వారీలో ఏర్పడే ఖాళీ ప్రదేశంలో నింపుతారు. ఈ విధంగా రెండు భూగర్భ గనులను ఓపెన్ కాస్ట్ గనులుగా మార్చినప్పటికీ ఆ క్వారీలలో అక్కడ ఉత్పత్తి జరిగే ఓవర్ బర్డెన్ మట్టితోనే నింపుతారన్నమాట.

ఇది ఒక భారీ పర్యావరణహిత చర్యగా పేర్కొనవచ్చు. అలాగే రామగుండం కోల్ మైన్ లో భాగంగా ఉన్న ఇతర ఓపెన్ కాస్ట్ గనుల బొగ్గు తవ్వకాలను కొనసాగిస్తారు. ఈ మొత్తం బొగ్గు తవ్వకాన్ని లాంగ్ వాల్, కంటిన్యూయస్ మైనర్, బోర్డర్ మైనర్స్, రోడ్డు హెడర్స్ ద్వారా అలాగే షావెల్-డంపర్ ప్రక్రియలో నిర్వహిస్తారు. కాగా ఈ మొత్తం ప్రాజెక్టుకు 4326.08 హెక్టార్ల విస్తీర్ణం గల భూమి అవసరం ఉంది. ఈ ప్రాజెక్టులో మొత్తం 5,403 మంది సింగరేణి ఉద్యోగులతో పాటు మరో 600 మంది కాంట్రాక్టు సిబ్బంది పని చేయనున్నారు. మొత్తం రూ. 2,194.05 కోట్ల మూల పెట్టుబడులతో ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు.

రామగుండం రీజియన్ కు ఒక వరంగా ఆర్‌జీ కోల్ మైన్ రామగుండం రీజియన్ లోని 3 ఏరియాలలో కొన్ని పాత గనులు మూతపడుతున్నందున సింగరేణి సంస్థ ఆ గనుల్లోని ఉద్యోగులకు వేరే చోట పని కల్పించడానికి, బొగ్గు ఉత్పత్తి లోటు తీర్చడానికి ఈ ఆర్‌జీ కోల్ మైన్ ఒక వరంగా మారనుంది. ఈ ప్రాజెక్టులో సుమారు 5,500 మంది ఉద్యోగులకు పని చేసే అవకాశం లభించబోతోంది. వ్యాపారపరంగా కూడా సింగరేణికి ఇది ఒక అద్భుత అవకాశం. రామగుండంలోని ఎన్టీపీసీ కి సింగరేణి సంస్థ దశాబ్దాల కాలంగా బొగ్గు సరఫరా చేస్తుంది. సింగరేణికి ఉన్న అతి పెద్ద వినియోగదారు ఎన్టీపీసీ. పాత గనులు మూతపడుతున్న నేపథ్యంలో తగినంత బొగ్గును ఎన్టీపీసీకి అందించలేని పరిస్థితి ఏర్పడేది కానీ రామగుండం కోల్ మైన్ కు అనుమతి రావడం వల్ల ఎన్టీపీసీతో సింగరేణి వ్యాపార బంధం ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనసాగనుంది. కనుక సింగరేణికి ఈ కొత్త ప్రాజెక్టు ఒక వరప్రదాయనిగా పేర్కొనవచ్చు.

# మద్యం ధరల పెంపు!?



(మొదటి పేజీ తరువాయి)

**మద్యం ధరలు పెంచాలని ఒత్తిడి**

మద్యం ధరలను పెంచాలనే డిమాండ్ చాలా రోజుల నుంచి ఉంది. రాష్ట్రంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి మద్యం ధరలను సవరించడం ఒక ఆనవాయితీగా వస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 మే నెలలో చివరిసారిగా ధరను పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025, మే నెలలోనే మద్యం తయారీ కంపెనీలు ధరలను పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. అయితే కొన్ని కారణాలతో అప్పట్లో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వాయిదా వేసింది.

**ధరల పెంపునకు ప్రధాన కారణాలు రెండే**

ప్రస్తుతం ధరల పెంపునకు ప్రధానంగా 2 కారణాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన, గ్యాస్ ధరలు పెరిగాయి. మద్యం బాటిళ్ల తయారీకి గ్యాస్ వినియోగం తప్పనిసరి. గ్యాస్ ధరల పెరగడంతో బాటిళ్ల తయారీ వ్యయం భారంగా మారిందని కంపెనీలు చెబుతున్నాయి. ముడిసరకుల ధరలు, రవాణా ఛార్జీలు, కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రస్తుత ధరలకు మద్యం సరఫరా చేయడం గిట్టుబాటు కావడం లేదని డిస్టలరీలు ప్రభుత్వం ముందు మొరపెట్టుకున్నాయి.

**60 నుంచి 120కి పైగా పెరిగే ఛాన్స్**

ధరల నిర్ధారణ కోసం ప్రభుత్వం ఇప్పటికే ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ వచ్చే వారం తొలిసారి భేటీ కానుంది. డిస్టలరీల నుంచి వచ్చిన ప్రతిపాదనలను ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న ప్రచారం ప్రకారం మధ్యే మార్గంగా ధరలను సవరించే ఛాన్స్ ఉంది. సాధారణ బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై సుమారు 60 రూపాయలు పెరగొచ్చు. ప్రీమియం బ్రాండ్లకు చెందిన ఫుల్ బాటిల్‌పై సుమారు వందల రూపాయలు పెంచనున్నారు. టాప్ ఎండ్ కేటగిరికి చెందిన ఫుల్ బాటిల్‌పై 120 రూపాయలకుపైగా పెంచబోతున్నట్టు సమాచారం.

**తెలంగాణ ఖజానాకు భారీగా ఆదాయం**

మద్యం కంపెనీలు భారీగా ధరలు పెంచాలని కోరుతున్నా ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం ఆచితూచి స్పందిస్తోంది. అయినా ఈ పెంపు కారణంగా రాష్ట్ర ఖానాకు భారీగా ఆదాయం సమకూరనుంది. ఇప్పుడు తీసుకునే నిర్ణయం వల్ల సుమారు 250 కోట్ల అదనపు ఆదాయం నెలకు రానుంది. అదే ఏడాదికి 3000 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# ఊరు వదిలి వెళ్లండి..

## పోలవరం నిర్వాసితుల బాధ

**ముద్ర డెస్క్:**

బహుళార్థసాధక పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన పునరావాసం, పునర్నిర్మాణ ప్రక్రియ ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన ముందుకు సాగుతోంది. ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాలను తక్షణమే ఖాళీ చేయించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్రస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం వేగంగా కదిలింది. శనివారం నుంచే అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ నిర్వాసితులను తరలించే కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

**41.15 కాంటూరుపై ప్రత్యేక దృష్టి**

ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా 41.15 కాంటూరు పరిధిలో ఉన్న గ్రామాలను ఖాళీ చేయించడంపై దృష్టి సారించింది. ముఖ్యంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25 గ్రామాలు ఈ పరిధిలోకి వస్తాయి. 2027 జూన్ నాటికి ప్రాజెక్టులో నీటి నిల్వను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ సమయానికి ఈ 25 గ్రామాలు పూర్తిగా జలమయం అయ్యే అవకాశం ఉన్నందున, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తుగా ఈ తరలింపు చర్యలు చేపట్టారు. మే 5వ తేదీ నాటికి ఈ ప్రక్రియ ఒక కొలిక్కి రావాలని ప్రభుత్వం గడువు విధించింది.

**మూడు రకాల పునరావాస ఆప్షన్లు**

ముంపునకు గురయ్యే కుటుంబాల సౌకర్యార్థం ప్రభుత్వం మూడు రకాల ఆప్షన్లను అందుబాటులోకి తెచ్చింది. అధికారులు నిర్వాసితులను ఈ వర్గాల వారీగా విభజించి తరలింపు ప్లాన్ సిద్ధం చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇస్తుంది. ఇప్పటికే మెజారిటీ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పన తుది దశలో ఉంది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్వాసితులు తమకు నచ్చిన విధంగా ఇళ్లను నిర్మించుకుంటారు. వీరికి అవసరమైన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం విడతల వారీగా అందిస్తుంది. ఇక లేదంటే ఇల్లు లేదా స్థలం అవసరం లేని వారు ఈ పద్ధతిని ఎంచుకున్నారు. వీరికి ప్రభుత్వం ఒకేసారి నిర్ణీత పరిహారాన్ని అందిస్తుంది. ఈ వర్గానికి చెందిన వారు తమ సొంత ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.

**క్షేత్రస్థాయిలో అధికారుల ప్రచారం**

ప్రాజెక్టు పరిహారం అందుకున్న వారు ఇంకా ముంపు గ్రామాల్లోనే నివసిస్తుండటంతో అధికారులు ఇంటింటికీ వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. 'పరిహారం పొందిన వారు తక్షణమే ఖాళీ చేయాలి' అంటూ రెవెన్యూ సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, నిర్వాసితుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ముఖ్యంగా పునరావాస కాలనీల్లో కల్పించిన వసతుల గురించి వివరించి, వారిని తరలి వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారు.

మొత్తానికి దశాబ్దాల కల అయిన పోలవరం ప్రాజెక్టు ఇప్పుడు ముంపు గ్రామాల ఖాళీ ప్రక్రియతో ఒక నిర్ణయాత్మక దశకు చేరుకుంది. రాబోయే కొద్ది రోజుల్లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు గ్రామాల చిత్రపటం పూర్తిగా మారిపోనుంది.

# ఐదు రాష్ట్రాల తీర్పు




(మొదటి పేజీ తరువాయి)

అస్సాం మరియు పుదుచ్చేరిలో ఎన్డీఏకు ఆధిక్యం అంచనాలు వెలువడుతున్నాయి.

పోలింగ్ శాతం కూడా నమోదైంది. బెంగాల్‌లో సుమారు 92 శాతం, అస్సాంలో 85.38 శాతం, తమిళనాడులో 84.69 శాతం, కేరళలో 79.63 శాతం, పుదుచ్చేరిలో 89.87 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ భారీ ఓటింగ్ ఫలితాలపై ప్రభావం చూపనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత కల్పించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, కేంద్ర బలగాలు అప్రమత్తంగా ఉన్నాయి.

ఈ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశం ఉండగా, ముఖ్యంగా కమలం పార్టీకి ఎంతవరకు అనుకూలిస్థాయో మరికొద్ది గంటల్లో తేలనుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 04.05.2026
www.mudranews.in | @mudranews



**ఈతపండ్లు :** జీర్ణశక్తి మెరుగుపరుస్తాయి. పీచుపదార్థాలు ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ సాఫీగా ఉంటుంది. మలబద్ధకం, కడుపునొప్పి సమస్యలు తగ్గుతాయి.



## నుదుటిన ముద్దుపెట్టి..

### తల్లి దీవెనలతో బాధ్యతలు స్వీకరించిన డీజీపీ సీవీ ఆనంద్



**ముద్ర, హైదరాబాద్:** పదవులు మనిషిని ఎత్తుకు తీసుకెళ్తాయి... కానీ తల్లి ఆశీర్వాదం మాత్రం జీవితానికి అర్థాన్ని ఇస్తుందని మరోసారి నిరూపితమైంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్, తన తల్లి యశోద దేవిని కలుసుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ భావోద్వేగ క్షణం అక్కడున్న వారిని హత్తుకుంది. అనారోగ్యంతో మంచానికే పరిమితమైన తల్లి, తన కుమారుడు రాష్ట్ర అత్యున్నత పోలీస్ పదవిని అలంకరించడం చూసి ఆనందభాష్పాలతో కళ్లు మెరిపించింది. వణుకుతున్న చేతులతో కుమారుడి నుదిటిపై తిలకం దిద్దుతూ ఆమె తన ఆశీర్వాదాలను అందించారు. తల్లి ముందు చేతులు జోడించి నమస్కరించిన ఆనంద్, అనంతరం ఆమెను ఆలింగనం చేసుకుని నుదుటిపై ముద్దుపెట్టుకున్నారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది. పోలీస్ అధికారిగా కఠిన నిర్ణయాలు తీసుకునే డీజీపీ ఆనంద్, ఆ క్షణంలో మాత్రం తల్లి ముందు సాధారణ కుమారుడిగా మారిపోవడం ప్రత్యేకంగా నిలిచింది. పదవులు, ప్రతిష్ఠలు ఒకవైపు ఉంటే... తల్లి ప్రేమ, దీవెనలు మరోవైపు ఎంత గొప్పవో ఈ సంఘటన స్పష్టం చేసింది.

## కాంగ్రెస్ నేతలపై విశ్వేశ్వర్ రెడ్డి హాట్ కామెంట్స్



**ముద్ర, సంగారెడ్డి:** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ ప్రభుత్వం బతుకుతోందని చేవెళ్ల ఎంపీ, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నిధుల లేవని సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో రైతు బతుకుతున్నాడంటే అందుకు కేంద్ర ప్రభుత్వమే కారణమన్నారు. ఆదివారం సంగారెడ్డిలో జిల్లా బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు చిప్ప చేతిలో పట్టుకుని నిధుల కోసం ఢిల్లీకి పోయి కేంద్ర మంత్రులను కలుస్తున్నారని ఎంపీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వారే హైదరాబాద్ వచ్చి మళ్లీ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తారని పేర్కొన్నారు. మరి చిప్ప చేత పట్టుకొని ఢిల్లీకి ఎందుకు పోతున్నారో? సమాధానం చెప్పాలంటూ అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను నిలదీశారు. తెలంగాణకి ప్రధాని మోదీ ఏం చేశారని కొంత మంది విమర్శిస్తున్నారని మండిపడ్డారు.

## 'ఆధార్' కొత్త లుక్ వార్తలు నిరాధారం



**ముద్ర, న్యూఢిల్లీ :** ఆధార్ కార్డుపై ఇకమీదట పేర్లు, చిరునామా లేకుండా కేవలం ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే ఉంటాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ ఖండించింది. ఈ వార్తలు నిరాధారమని, ప్రజలు ఎవ్వరూ నమ్మొద్దని పిలుపు నిచ్చింది. అలాంటి కార్డు తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఇలాంటి పోస్టులు ప్రజల్లో అనవసరమైన అయోమయాన్ని సృష్టిస్తున్నందున స్పష్టత ఇస్తున్నట్లు పేర్కొంది. ప్రజలు యూఐడీఏఐ నుంచి వచ్చే అధికారిక ప్రకటనలు తప్పితే సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే ప్రచారాన్ని నమ్మొద్దని కోరింది.

# ఇండ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు

**త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇళ్ల మంజూరు**
**కూసుమంచి ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా**



**ముద్ర, ఖమ్మం :** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సాదా బైనామా, నిషేధిత జాబితా , భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా సంక్షేమ పథకాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేశారు. ప్రజా దర్బార్లలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే దరఖాస్తులు వస్తున్నాయన్న మంత్రి, గత ప్రభుత్వ వైఫల్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని, మే నెలాఖరు నాటికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 25 లక్షల మందికి రుణమాఫీ చేశామని, రైతు భరోసాను ఎకరానికి 12 వేలకు పెంచడంతో పాటు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని గుర్తుచేశారు. మే 5 నుంచి 7 వరకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ టికెట్ల దందా..

**నకిలీ లేఖలతో ఐపీఎల్ టికెట్లు ముఠా అరెస్ట్**




**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, మల్కాజ్ గిరి స్పెషల్ బ్రాంచ్, ఎస్ ఓటీ పోలీసుల సంయుక్త ఆపరేషన్ లో ఐపీఎల్ టికెట్లను అక్రమంగా విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు అశోక్ ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హైదరాబాద్ లో ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల కోసం జడ్జిలు, ఉన్నతాధికారుల పేర్లు చెబుతూ హెచ్ సీఏకు పలుమార్లు ఫోన్ కాల్స్ రావడం అనుమానాలకు తావిచ్చింది. ఈ కాల్స్ పై అనుమానం వచ్చిన హెచ్సీఏ కార్యదర్శి మన్నె జీవన్ రెడ్డి, విషయం మల్కాజ్ గిరి సీపీ సుమతికి తెలియజేశారు. దీంతో మల్కాజ్ గిరి స్పెషల్ బ్రాంచ్, ఎస్ ఓటీ పోలీసులు, హెచ్ సీఏ కలిసి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. పీఎంఓ, గవర్నర్ కార్యాలయం, జడ్జిలు, అలాగే ఇతర క్రికెట్ అసోసియేషన్ల పేర్లు చెబుతూ నకిలీ లేఖలు తయారు చేసి టికెట్లు సంపాదించేందుకు ముఠా ప్రయత్నించినట్లు గుర్తించారు. ఈ లేఖలు పూర్తిగా నకిలీవని నిర్ధారించిన హెచ్సీఏ, ముఠాను పట్టుకునేందుకు టికెట్లను ఎరగా వేసింది. అనంతరం బ్లాక్ మార్కెట్ లో టికెట్లు విక్రయిస్తున్న సమయంలో ఎస్ ఓటీ పోలీసులు ముఠాను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు అశోక్ ను పోలీసులు విచారిస్తున్నారు. మిగతా ముఠా సభ్యుల కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

# కవిత పదికోట్లు అడిగితే కేసీఆర్ ఇవ్వద్దన్నారు.!

**కవిత పార్టీతో ఎవరికీ ఎలాంటి లాభం లేదు**
**తన ఆస్తులను కాపాడుకునేందుకే కవిత ఆరాటం**
**ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన టీఆర్ఎస్ పార్టీతో ఎవరికీ ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వ్యాఖ్యానించారు. కేవలం తన ఆస్తులను కాపాడుకోవడం కోసమే కవిత ఆరాటపడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన అమెరికా పర్యటన బిజీ కారణంగా ఇన్ని రోజులు తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారించలేకపోయానని పేర్కొన్నారు. తండ్రి కేసీఆర్‌తో వచ్చిన విభేదాల కారణంగానే కవిత కొత్త పార్టీని స్థాపించారని పాల్ తెలిపారు. గతంలో కవిత ముఖ్యమంత్రి పదవి అడిగితే కేసీఆర్ నిరాకరించారని ఆయన వెల్లడించారు. 2008లోనే కవిత తన వద్దకు వచ్చి పార్టీ నిధుల కోసం రూ.10 కోట్లు అడిగారని గుర్తు చేశారు. అప్పట్లో తాను రూ. 15 కోట్లు ఇద్దామనుకున్నానని, కానీ కవితకు ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని కేసీఆర్ కోరడంతో వెనక్కి తగ్గానని చెప్పారు. అలాగే ప్రస్తుతం అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధాన్ని నివారించేందుకు తాను డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపే పనిలో ఉన్నానని కేఏ పాల్ తెలిపారు. ఈ యుద్ధం ఆగకపోతే ప్రపంచ వ్యాప్తంగా 850 కోట్ల మంది ప్రజలు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. డొనాల్డ్ ట్రంప్ సహా పలు దేశాల ప్రతినిధులు తన సలహాలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. తానూ అప్పులు తీసుకురాగలనని, తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేయగలనని ధీమా వ్యక్తం చేశారు. కులమతాలకు అతీతంగా మేధావులు, సామాన్యులు అందరూ ప్రజాశాంతి పార్టీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు.

# అబద్ధాలకు కేరాఫ్ తెలంగాణ భవన్

**కేసీఆర్, హరీశ్ రావు అబద్ధాలకోర్లు**
**సీఎం పై అక్కసుతోనే మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపణలు**
**మీడియాతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ తెలంగాణ భవన్ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు అబద్ధాల కోరులని వ్యాఖ్యానించారు.సీఎం రేవంత్ రెడ్డిపై అక్కసుతోనే మాజీ జీవన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కానీ ప్రజలు రేవంత్ రెడ్డి పాలనే కోరుకుంటున్నారన్నారు. ఆదివారం సీఎల్పీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆది శ్రీనివాస్.. పార్టీ మారిన జీవన్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఆయన కాంగ్రెస్‌లో ఉండగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని అనేక వేదికలపై చెప్పారన్నారు. కండువా మార్చగానే మాట మార్చారని ఎద్దేవా చేశారు. అక్కడికి వెళ్లగానే జీవన్ రెడ్డి కూడా అబ్బద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను జీవన్ రెడ్డి పొగిడిన మాట వాస్తవం కాదా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. సన్నబియ్యం పథకం గేమ్ చేంజర్ స్కీమ్ అని అన్నది మీరే కదా అని నిలదీశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాపాల పాలనపై ఒంటరి పోరాటం చేశానని చెప్పిన జీవన్ రెడ్డి ఇప్పుడు ప్రజా పాలన పోవాలని అనడంపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రజలు రేవంత్ రెడ్డే కావాలని, రేవంత్ రెడ్డినే మళ్లీ రావాలని కోరుకుంటున్నారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక యువతను మోసం చేసిందని ఆరోపించారు. పదేళ్లలో గ్రూప్–1 ఉద్యోగాలు భర్తీ చేయలేదని దుయ్యబట్టారు. యువత త్యాగాలను బీఆర్ఎస్ ఏనాడు పట్టించుకోలేదన్నారు

## అల్లిపూర్‌లో గ్రామంలో మొక్కజొన్న పంట దగ్ధం



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** బిజినేపల్లి మండలం అల్లిపూర్ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసి పడి మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు డొక్కా శ్రీనివాసులు 2.10 గుంటల భూమిలో సాగు చేసిన మొక్కజొన్న పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ఘటనతో సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం, సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎతతతగిసి పొలంలో పడటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందేసరికే పంట మొత్తం అగ్నికి ఆహుతైంది.ఈ ఘటనపై రైతులు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తున్నారు. బాధిత రైతును ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## తప్పిపోయిన బాలుడు.. తల్లిదండ్రుల చెంతకు



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** పట్టణంలో తప్పిపోయిన ఓ బాలుడిని అధికారులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మాజిపేట మండలం మారేపల్లి గ్రామానికి చెందిన మొట్ట లక్ష్మమ్మ శనివారం సాయంత్రం తన ఐదేళ్ల కుమారుడు చిన్నతో కలిసి మందుల కోసం బస్టాండ్ సమీపంలోని ఆసుపత్రికి వచ్చింది. బస్టాండ్ ఆవరణలో బాలుడు ఏడుస్తుండడంతో అతనికి బిస్కెట్లు తీసుకురావడానికి సమీపంలోని దుకాణానికి వెళ్లిన లక్ష్మమ్మ తిరిగి వచ్చేసరికి బాలుడు అక్కడ కనిపించలేదు. కొంతసేపు వెతికినా కనిపించకపోవడంతో లక్ష్మమ్మ ఆందోళనకు గురై స్పృహ తప్పి పడిపోయింది. ఇదే సమయంలో బస్టాండ్ పరిసరాల్లో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని గమనించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు బాలుడిని స్వాధీనం చేసుకుని బాలల సంరక్షణ అధికారులకు అప్పగించారు. తల్లిదండ్రుల వివరాలు తెలియకపోవడంతో బాలుడిని పాత కలెక్టరేట్‌లోని బాలల సంరక్షణ గృహంలో ఉంచారు. ఇక స్పృహ కోల్పోయిన లక్ష్మమ్మను గుర్తించిన స్థానికులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం కుమారుడు కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, బాలుడు సురక్షితంగా సంరక్షణ గృహంలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. తదనంతరం బాలల సంరక్షణ అధికారుల సమక్షంలో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ శ్రీశైలం, బాలల సంరక్షణ కౌన్సిలర్ మల్లేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సూపర్వైజర్ సురేష్, ఏఎస్ఐ చంద్రయ్య, కేస్ వర్కర్ ప్రమీల, అవుట్ రిచ్ వర్కర్ లలిత పాల్గొన్నారు.

## సినీగేయ రచయిత చంద్రబోస్ సోదరుడు మృతి

**చల్లగరిగలో విషాదఛాయలు**



**ముద్ర, భూపాల్‌పల్లి:** ప్రముఖ సినీగేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ సోదరుడు కనుకుంట్ల రాజేందర్(60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో ఆయన స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన కనుకుంట్ల నరసయ్య, మధునమ్మ దంపతులకు రాజేందర్, కోటి, చంద్రబోస్ ముగ్గురు కుమారులు, పెద్ద కుమారుడు రాజేందర్ గతంలో కండక్టర్ గా పనిచేశారు. ప్రజారాజ్యం పార్టీలో పని చేసి, రాజకీయాలకు దూరంగా ఉంటూ బిజినెస్ పనులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో రాజేందర్ మరణం ఆయన కుటుంబ సభ్యులను, సన్నిహితులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్నమయ్య జిల్లా కలికిరి మండల కేంద్రంలో ఉన్న తన స్నేహితుడిని కలిసేందుకు శనివారం అక్కడికి వెళ్లిన ఆయన రాత్రి తన స్నేహితుడి ఇంట్లోనే బస చేసి, ఆదివారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో స్నేహితులు ఆయనను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న సమయంలోనే రాజేందర్ పరిస్థితి విషమించింది. వైద్యులు శ్రమించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రాజేందర్ మృతి పట్ల సినీ ప్రముఖులు, చంద్రబోస్ అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. రాజేందర్ మృతితో స్వగ్రామమైన చల్లగరిగలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆస్కార్ అవార్డు పొందిన చంద్రబోస్ కు స్వగ్రామమైన చల్లగరిగలో ఇటీవలే గ్రామస్తులు ఘనంగా సన్మానించిన విషయం తెలిసిందే. కాగా ఆ వేడుకల్లో రాజేందర్ ముందు వరుసలో ఉండి స్థానికంగా ఏర్పాట్లను పరిశీలించి కార్యక్రమాన్ని సక్సెస్ చేశారు. చంద్రబోస్ కు సంబంధించిన అన్ని విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకునే సోదరుడు ఆకస్మికంగా మృతి చెందడం ఆ కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగింది. సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## పిల్లల వేసవి శిబిరం ప్రారంభోత్సవం

**ముద్ర, హైదరాబాద్ :** పిల్లలకు వేసవి సెలవులలో వివిధ నైపుణ్యాలు నేర్చుకుంటూ వేసవి సమయాన్ని సద్వినియోగం చేసుకోటానికి నీలం రాజశేఖర రెడ్డి రీసెర్చ్ సెంటర్, చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్, సురవరం సుధాకర్ రెడ్డి లైబ్రరీ లోని ఛిల్డ్రన్స్ లైబ్రరీ లో పిల్లలకు మంచి కార్యక్రమాలు రూపొందించబడ్డాయి. డ్రాయింగ్, పెయింటింగ్, క్రాఫ్ట్ వర్క్స్, సింగింగ్, స్టోరీ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, రీడింగ్, క్లే వర్క్, డ్రామా రైటింగ్, ప్లేయింగ్ మొదలైన సృజనాత్మక కార్యక్రమాలు ఆదివారం ఉదయం సి ఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది పిల్లలు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలకు కాగితంతో క్రాఫ్ట్ చేయటం, ఫాబ్రిక్ పెయింటింగ్ నేర్పించడం తో పాటు క్యారమ్స్ , చెస్ వంటి ఆటలు కూడా నిర్వహించారు వేసవిలో పిల్లలు సమయాన్ని సక్రమంగా వినియోగించుకొని ఇటువంటి క్యాంపులకు వెళ్ళడం ఉపయోగకరముగా ఉంటుందని, పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.జ్యోత్స్న ఫాబ్రిక్ పెయింటింగ్ , సునీత , జ్యోత్స్న పేపర్ క్రాఫ్ట్స్ లో పిల్లలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం డైరెక్టర్ సురేష్ బాబు , కన్వీనర్ అజయ్ కుమార్ , కమిటీ మెంబర్స్ డా. బి వి విజయ లక్ష్మి , డా. కె. పూర్ణచంద్ర రావు, సుబ్బరామన్ , వెల్లంకి అనిల్ , సురవరం సుధాకర్ రెడ్డి లైబ్రరీ కన్వీనర్ రాజగోపాల్ రెడ్డి, కొ కన్వీనర్ కె. జ్యోత్స్న, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కల్పన, మంజరి, సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం నివాసులు పాల్గొన్నారు. వేసవి శిబిరం ద్వారా మే నెలలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సంపాదకీయం

## కులాన్ని మాత్రమే కాదు...
# కుల-వర్గ దోపిడీని ఛేదించే మహాగ్రంథం



**"కుల వ్యవస్థ – బీసీ సమస్య" : ఒక సమగ్ర విశ్లేషణాత్మక సమీక్ష**

భారతీయ సమాజ మూలాలను అర్థం చేసుకోవాలంటే కుల వ్యవస్థను, దాని వెనుక ఉన్న శ్రమ దోపిడీని విశ్లేషించాల్సిందే. ఉత్పత్తి కులాల చరిత్రను, వారు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అణచివేతను శాస్త్రీయంగా ఆవిష్కరించిన అరుదైన ఉద్యమ గ్రంథం "కుల వ్యవస్థ – బీసీ సమస్య". సంపాదకులు పాపని నాగరాజు రూపొందించిన ఈ బృహత్తర గ్రంథం కేవలం ఒక పుస్తకం కాదు; ఇది బహుజన సమాజం పాలిట ఒక చైతన్య మానిఫెస్టో.

**ఉద్యమ ప్రస్థానం – సామాజిక ప్రభావం**

2016లో వెలువడిన ఈ గ్రంథం, నేడు 1184 పేజీలతో నాలుగో ముద్రణకు చేరుకోవడం దీని ప్రాముఖ్యతను చాటుతోంది. వేలాది ప్రతులు ఉచితంగా విద్యార్థులకు, మేధావులకు అందజేయడం ద్వారా ఇది ఒక సామాజిక చైతన్య వాహికగా మారింది. ఆంధ్రప్రదేశ్ లో బీసీ కార్పొరేషన్ల ఏర్పాటు వంటి విధానపరమైన మార్పులకు, బీసీ హక్కులపై జరిగిన చర్చలకు ఈ పుస్తకం ఒక ప్రధాన ప్రేరణగా నిలిచింది.

**గ్రంథ నిర్మాణం: సిద్ధాంతం మరియు ఆచరణ**

ఈ పుస్తకం 28 ప్రధాన అధ్యాయాలు మరియు 9 కీలక అనుబంధాలతో అత్యంత ప్రామాణికంగా రూపొందించబడింది.

28 అధ్యాయాలు: బీసీల చరిత్ర, రాజకీయం, ఆర్థిక స్థితిగతులు మరియు భావజాల కోణాలను విశ్లేషిస్తాయి.

అనుబంధాలు: గణాంకాలు, కమిషన్ల నివేదికలు, చట్టపరమైన అంశాలు మరియు ఉద్యమ డిమాండ్లను ఆధారాలతో సహా అందిస్తాయి.

**గ్రంథంలోని ప్రధాన ముఖ్యాంశాలు:**

రాజకీయ విశ్లేషణ: బీసీ జాబితాలోకి ఇతర కులాల చేరిక, దానివల్ల నిజమైన వెనుకబడిన వర్గాలకు జరుగుతున్న నష్టాన్ని గణాంక సహితంగా ప్రశ్నిస్తుంది.

భావజాల సమన్వయం: పూలే, అంబేద్కర్, పెరియార్, మార్క్స్ మరియు మరోజు వీరన్నల ఆలోచనా దృక్పథాలను మేళవించి, విముక్తి రాజకీయాలకు పునాది వేస్తుంది.



దామాషా ప్రాతినిధ్యం: "జనాభా ప్రాతిపదికన వాటా" అనే సూత్రమే సామాజిక న్యాయానికి అసలైన మార్గమని ఈ గ్రంథం బలంగా వాదిస్తుంది.

ఆర్థిక విధ్వంసం: ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ వల్ల కులవృత్తులు ఎలా దెబ్బతిన్నాయో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎలా చిన్నాభిన్నమైందో కూలంకషంగా చర్చించింది.

బీసీ అట్రాసిటీ యాక్ట్: దళితులకు ఉన్నట్టే, బీసీలపై జరిగే సామాజిక, ఆర్థిక దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం అవసరమనే డిమాండ్ ను ఈ పుస్తకం ముందు వరుసలో నిలబెట్టింది.

**ఐక్యత – ఒక దిశానిర్దేశం**

ఈ గ్రంథం యొక్క గొప్పతనం పీడిత వర్గాల మధ్య ఐక్యతను కోరుకోవడంలో ఉంది. బీసీల సమస్యలను చర్చిస్తూనే.. దళిత, ఆదివాసీ, మైనారిటీ వర్గాలతో కలిసి సాగాల్సిన అవసరాన్ని గుర్తిస్తుంది. పీడిత వర్గాల మధ్య పోటీ కంటే, వారి ఐక్యతే విముక్తికి దారి అని ప్రబోధిస్తుంది. అదే సమయంలో, రాజకీయ పక్షాలకు అమ్ముడై ఉద్యమాన్ని నీరుగార్చే దళారీ నాయకత్వాన్ని నిర్ద్వంద్వంగా ఎండగడుతుంది.



పి. రేణుక భూంపల్లి

"జనాభాలో మెజారిటీ అయిన మనం.. అధికారంలో ఎందుకు మైనారిటీగా ఉన్నాం?" అనే మౌలిక ప్రశ్నను ప్రతి పాఠకుడిలో ఈ గ్రంథం రేకెత్తిస్తుంది. పాపని నాగరాజు శ్రమశక్తితో వెలువడిన ఈ పుస్తకం, కేవలం గ్రంథాలయాల్లో భద్రపరుచుకోవడానికి కాదు.. ప్రతి బహుజన గడపలో చర్చించాల్సిన యుద్ధ ప్రకటన. కుల–వర్గ దోపిడీని అంతం చేసి, సామాజిక రాజ్యాధికారం వైపు నడిపించే ఒక దిక్సూచి.

# ధూమపానానికి 'మ్యాజిక్ మష్రూమ్' చెక్

ధూమపానం అలవాటు ఉన్నవారు ఆ వ్యసనాన్ని వదిలించుకోవడం చాలా కష్టం. పొగాకులోని నికోటిన్ కూడా పెను వ్యసన కారకమవుతుంది. అయితే మ్యాజిక్ మష్రూమ్ అనే ఒకరకం పుట్టగొడుగులో ఉన్న సైలోసైబిన్ అనే పదార్థం.. ధూమపానాన్ని వదిలించుకోవడానికి సాయపడుతుందని పరిశోధనల్లో వెల్లడైంది.

సైలోసైబిన్ అనేది ఒకరకం సైకెడెలిక్ డ్రగ్. ఇది భావన, భావోద్వేగం వంటివాటిని మారుస్తుంది. గతంలో శతాబ్దాల పాటు దీన్ని మతపరమైన కార్యక్రమాల్లో ఉపయోగించేవారు. చాలా దేశాల్లో సైకెడెలిక్ డ్రగ్స్ వినియోగంపై ప్రస్తుతం నిషేధం ఉన్నా... అనేక మానసిక రుగ్మతలకు చికిత్స, వ్యసనాలను మాన్పించడానికి దీన్ని ఉపయోగించే అంశంపై పలు పరిశోధనలు జరుగుతున్నాయి. సైలోసైబిన్ వాడకం వల్ల ధూమపానం అలవాటు తగ్గడం కానీ పూర్తిగా మానేయడం కానీ జరిగినట్లు 781 మందితో జరిగిన ఒక పరిశోధనలో వెల్లడైంది. ఇందులో నికోటిన్ అలవాటును వదిలేసిన వారిలో దాదాపు అందరూ ఒకే అంశాన్ని ప్రస్తావించారు. ధూమపానం ఇంకెంతమాత్రం విలువలేనిదిగా తమకు తోచిందన్నారు. మార్చిలో అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన మాథ్యూ జాన్సన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తలు ఒక అధ్యయనాన్ని ప్రచురించారు. అందులో సైలోసైబిన్ ప్రభావంపై గట్టి ఆధారాలు లభించాయి. కేవలం నికోటిన్ ప్యాచ్‌తో చికిత్స పొందినవారితో పోలిస్తే.. వీరు పొగతాగడాన్ని వదిలేసే అవకాశం ఆరు రెట్లు ఎక్కువని తేలింది. పొగతాగడాన్ని మాన్పించడానికి సాయపడే మందులేవీ గత 20 ఏళ్లలో అమెరికాలో రాలేదని, అందువల్ల తాజా పరిశోధనలో వెల్లడైన అంశాలు ఆసక్తికరమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

## ఎస్ఆర్‌హెచ్ ఆరో విజయానికి
# కళ్లెం వేసిన కేకేఆర్




**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత ఉత్సాహభరితంగా సాగుతోంది. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) యువ బ్యాటర్ అభిషేక్ శర్మ తన అద్భుతమైన ఫామ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR) తో జరిగిన 45వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలైనప్పటికీ, వ్యక్తిగత ప్రదర్శనలో అభిషేక్ శర్మ తన ముద్రను వేయగలిగాడు. తన దూకుడుతో కూడిన బ్యాటింగ్ శైలి ద్వారా అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మొదటి స్థానానికి చేరుకుని, ప్రతిష్టాత్మకమైన 'ఆరెంజ్ క్యాప్' ను దక్కించుకున్నాడు. అంతక ముందు ఇది కేఎల్ రాహుల్ దగ్గర ఉండగా.. నేడు 15 పరుగులు చేసిన అభిషేక్ శర్మకు ఈ క్యాప్ మళ్లీ వచ్చింది. జట్టు విజయానికి దూరమైనా, అతని వ్యక్తిగత ప్రతిభ మాత్రం ఈ సీజన్‌లో హాట్ టాపిక్ గా మారింది.

ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో అభిషేక్ శర్మ ఒక పవర్‌హౌస్‌లా కనిపిస్తున్నాడు. అతని గణాంకాలు చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. 10 మ్యాచ్‌లలో అభిషేక్ శర్మ మొత్తం 440 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో ఉన్నాడు. 48.89 సగటుతో పరుగులు సాధిస్తూ నిలకడను ప్రదర్శిస్తున్నాడు. టీ20 ఫార్మాట్‌కు తగ్గట్టుగా 206.57 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు. ఈ సీజన్‌లో అతని అత్యుత్తమ స్కోరు 135 నాటౌట్. ఇప్పటివరకు 1 సెంచరీ మరియు 3 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. తన ఇన్నింగ్స్‌లలో మొత్తం 41 ఫోర్లు , 32 సిక్సర్లు బాదాడు. కేఎల్ రాహుల్ (433 పరుగులు), హెన్రిచ్ క్లాసెన్ (425 పరుగులు) వంటి దిగ్గజ ఆటగాళ్లను వెనక్కి నెట్టి అభిషేక్ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కేకేఆర్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించినప్పటికీ.. అభిషేక్ వ్యక్తిగత పోరాటం ఆరెంజ్ క్యాప్ రూపంలో ఫలించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు అతడు ప్రధాన బలంగా మారాడు. అతని దూకుడు ఇలాగే కొనసాగితే ఈ సీజన్ ముగిసేసరికి మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశం ఉంది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. వరుస విజయాలతో దూసుకుపోతూ, ఈ మ్యాచ్‌లో గెలిచి ఆరో విజయాన్ని తన ఖాతాలో వేసుకోవాలని భావించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) ఆశలపై కేకేఆర్ నీళ్లు చల్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసిన కోల్‌కతా, అనంతరం 18.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అంగ్క్రిష్ రఘువంశీ (59) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడగా, అజింక్య రహానే (43) అతనికి చక్కని సహకారం అందించారు. ఈ ఓటమితో సన్‌రైజర్స్ విజయ పరంపరకు బ్రేక్ పడటమే కాకుండా, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి వెళ్లే అవకాశం చేజారింది. కేకేఆర్ బౌలర్లు, బ్యాటర్లు సమిష్టిగా రాణించి హైదరాబాద్ జట్టుకు చుక్కలు చూపారు.




## రూ.15,600 కోట్ల భారీ డీల్
### రాజస్థాన్ రాయల్స్ కు కొత్త యజమాన్యం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ కలిగిన ఫ్రాంచైజీల్లో ఒకటైన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మీ ఎన్. మిట్టల్ కుటుంబం, సీరమ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత అదర్ పూనావాలాతో కలిసి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. మనోజ్ బదాలే నేతృత్వంలోని ప్రస్తుత కన్సార్టియం నుంచి ఈ జట్టును సుమారు 1.65 బిలియన్ అమెరికన్ డాలర్లకు (దాదాపు రూ.15,600 కోట్లు) సొంతం చేసుకోనున్నారు. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యంత విలువైన ఒప్పందాల్లో ఒకటిగా నిలిచింది.

మొదట అమెరికన్ వ్యాపారవేత్త కల్ సోమానీ కన్సార్టియం 1.63 బిలియన్ డాలర్ల బిడ్‌తో ముందుకొచ్చినా, నిధుల సమీకరణ సమస్యలు, డ్యూ డిలిజెన్స్ ప్రక్రియలో వచ్చిన ఇబ్బందుల వల్ల ఆ డీల్ రద్దైంది. దీంతో మిట్టల్ కుటుంబం రంగప్రవేశం చేసి అదర్ పూనావాలాతో కలిసి రాజస్థాన్ రాయల్స్‌ను చేజిక్కించుకుంది.

కొత్త యాజమాన్య నిర్మాణం ప్రకారం మిట్టల్ కుటుంబం దాదాపు 75 శాతం మెజారిటీ వాటాను కలిగి ఉండగా, అదర్ పూనావాలా సుమారు 18 శాతం వాటా దక్కించుకోనున్నారు. మిగిలిన వాటా మనోజ్ బదాలే సహా ప్రస్తుత పెట్టుబడిదారుల వద్ద కొనసాగనుంది.

ఈ ఒప్పందంలో కేవలం ఐపీఎల్ జట్టు మాత్రమే కాకుండా, పార్ల్ రాయల్స్ (దక్షిణాఫ్రికా టీ20 లీగ్), బార్బడోస్ రాయల్స్ (కరీబియన్ ప్రీమియర్ లీగ్) జట్లు కూడా భాగస్వామ్యంగా ఉన్నాయి. యాజమాన్య మార్పు అనంతరం బోర్డులో లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్, వనిషా మిట్టల్–భాటియా, అదర్ పూనావాలా, మనోజ్ బదాలే కొనసాగనున్నారు.

మనోజ్ బదాలే తన అనుభవంతో కొత్త యాజమాన్యానికి వ్యూహాత్మక సలహాదారుడిగా ఉండనుండగా, ఈ ఒప్పందం 2026 మూడో త్రైమాసికంలో పూర్తి కావచ్చని అంచనా. అయితే బీసీసీఐ, సీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సహా సంబంధిత నియంత్రణ సంస్థల ఆమోదం అనంతరమే ఇది అధికారికంగా అమల్లోకి రానుంది.





**ఘనంగా బండ్ల గణేష్ కుమార్తె**
## జనని నిశ్చితార్థం..

ముద్ర, హైదరాబాద్ : నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట త్వరలోనే పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆయన కుమార్తె జనని వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో జనని వివాహం జరగనుంది. వీరి నిశ్చితార్థ వేడుకను ఆదివారం ఉదయం నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఏపీ సీఎం చంద్రబాబు దంపతులు, ప్రముఖ నటుడు చిరంజీవితో సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై, కాబోయే దంపతులను ఆశీర్వదించారు. రాఘవేంద్ర రావు, బ్రహ్మానందం, కోన వెంకట్ , శివాజీ, సి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రాగన్ కోసం డబుల్ మేకోవర్..
## ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు పూనకాలే



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ – సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న డ్రాగన్ చిత్రంపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జెట్ స్పీడ్ లో ఫుల్ స్వింగ్‌లో జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ప్రశాంత్ నీల్ స్క్రిప్ట్‌లో మరిన్ని కీలక మార్పులు చేసి గతంలో కంటే మరింత పవర్‌ఫుల్‌గా ఎలివేషన్లను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో తారక్ మునుపెన్నడూ చూడని విధంగా రెండు విభిన్న రూపాల్లో కనిపించబోతున్నారు. ఒకే సినిమాలో రెండు షేడ్స్ చూపించడం ప్రశాంత్ నీల్ స్పెషాలిటీ కాగా, ఎన్టీఆర్ మేకోవర్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పార్ట్–1లో ఎన్టీఆర్ చాలా షార్ప్‌గా, లీన్ లుక్‌లో కనిపించనున్నారు. పార్ట్–2 కోసం తారక్ 'బీస్ట్ మోడ్'లోకి మారనున్నారు. భారీ కండలు పెంచి బల్క్ ట్రాన్స్‌ఫార్మేషన్ చూపించబోతున్నారు. ఎన్టీఆర్ మేకోవర్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు ఫ్యాన్స్.

## పర్పుల్ శారీలో సీరత్
## అందాల జాతర



గ్లామర్ తో అభిమానులను అలరిస్తూ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే సీరత్ కపూర్ మరోసారి తన లేటెస్ట్ ఫోటోలతో అందరి దృష్టిని ఆకర్షించింది. 'రన్ రాజా రన్' సినిమాతో టాలీవుడ్ లో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ, ఇప్పుడు సోషల్ మీడియానే తన స్టైల్ స్టేజ్ గా మార్చుకుంది.

తాజాగా పర్పుల్ కలర్ శారీలో దర్శనమిచ్చిన సీరత్, సంప్రదాయానికి గ్లామర్ టచ్ జోడిస్తూ ఆకట్టుకుంది. స్టైలిష్ బ్లౌజ్, మెడలో భారీ హారం, వదిలిన జుట్టుతో ఆమె లుక్ మరింత ప్రత్యేకంగా నిలిచింది.

అందాలను హైలైట్ చేస్తూ ఇచ్చిన స్టన్నింగ్ పోజులు అభిమానులను ఫిదా చేస్తున్నాయి. క్లాసిక్ లుక్ లోనూ తన గ్లామర్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపించిన సీరత్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారి నెటిజన్ల నుంచి భారీ స్పందన అందుకుంటున్నాయి.

- ముద్ర, సినిమా డెస్క్

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 04-05-2026
www.mudranews.in | @mudranews



**ఈతపండ్లు**
**రక్తహీనత తగ్గిస్తుంది**



ఇందులో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. హిమోగ్లోబిన్ పెంచి ఎనిమియా సమస్యను తగ్గిస్తుంది.



## శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో అక్షరాభ్యాసాలు..

**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతి నిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద ఉన్న శ్రీ జ్ఞాన సర స్వతి దేవాలయంలో ఆదివారం అనురాధ నక్షత్రం సందర్భంగా శుభకార్యాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పి. నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల నుంచి వచ్చిన భక్తుల చిన్నారులకు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాస కార్యక్రమం, అన్నప్రాస కార్యక్రమం వేద మంత్రోచ్చా రణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆకారపు విశ్వనాథం, నరహరి బాలస్వామి, శివకుమార్ నవీన్, భార్గవి తదితరులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## సమత నగర్ కాలనీ పార్క్‌లో నూతన వీధి దీపాలు ప్రారంభం

**హైదర్‌నగర్, ముద్ర ప్రతినిధి:** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమత నగర్ కాలనీ పార్క్‌లో రూ.2 లక్షల 20 వేల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన వీధి దీపాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి స్విచ్ ఆన్ చేసి దీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, సమత నగర్ కాలనీ పార్క్‌లో వీధి దీపాల ఏర్పాటు చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. వీధి దీపాల వల్ల కాలనీ వాసులు, ముఖ్యంగా రాత్రి వేళల్లో పార్క్‌లో నడకకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు వీలవుతుందని తెలిపారు. వీధి దీపాల వెలుగులతో పార్క్‌కు కొత్త శోభ వచ్చిందని, ప్రకాశవంతమైన కాంతులు కాలనీలో ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకువచ్చాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో వాకింగ్‌కు వచ్చే వారికి భద్రత, సౌకర్యం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. పార్క్‌లలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని, హైదర్‌నగర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం ఆర్డీఓ స్థాయిలో ప్రజావాణి



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** అలంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ప్రతి సోమవారం ఆర్డీఓ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి ఉంటుందని, అన్ని శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారు లందరూ అందుబాటులో ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమం సజావుగా నిర్వహణ కోసం అలంపూర్ డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్ రెడ్డి, ఉండవెల్లి డిప్యూటీ తహసీల్దార్ జి. వెంకట రమణలను పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ప్రజల ఫిర్యాదులను సిజిజి ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, అంగీకార పత్రం ఇవ్వడం మరియు సంబంధిత శాఖలకు పంపించే ప్రక్రియను వీరు పర్యవేక్షిస్తారని తెలిపారు..

## శ్రీ కోటి మైసమ్మ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ



**ముద్ర, కాప్రా:** నాగారం గ్రామంలోని ఓల్డ్ విలేజ్‌లో ఉన్న శ్రీ కోటి మైసమ్మ దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడుతుందని తెలిపారు. మైసమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విఠలేశ్వర స్వామి జాతర ఉత్సవాలు

**- పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**

**ముద్ర, తాండూర్:** తాండూర్ నియోజకవర్గంలోని యాలాల మండలంలోని తిమ్మాయిపల్లిలో ఆదివారం విఠలేశ్వర స్వామి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జాతరలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ పండితులు మహేందర్ రెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, తాండూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, తాండూర్ పట్టణ యువ నాయకులు బిర్కట్ రఘు, భగవాన, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నిరుద్యోగ సంక్షోభంపై విధాన మార్పులు అవసరం

**- ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర**



**మేడ్చల్, ముద్ర ప్రతినిధి:**

నిరుద్యోగ సంక్షోభంపై సమగ్ర విధాన మార్పులు అవసరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన యువజన సంఘ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై పోరాడుదామని, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమించుదామని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ఏఐవైఎఫ్ 1959 మే 3న ఆవిర్భవించిందని తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఆవిర్భావ మహాసభలో 11 రాష్ట్రాల నుంచి 250కి పైగా ప్రతినిధులు, పరిశీలకులు పాల్గొన్నారని చెప్పారు. ఆరు రోజులపాటు జరిగిన ఈ చారిత్రాత్మక సమావేశంలో అధికారికంగా ఏఐవైఎఫ్ ఏర్పాటును ప్రకటించారని తెలిపారు. సామ్యవాద ఆలోచనలను వ్యాప్తి చేయడం, యువతను సామాజిక మార్పు దిశగా నడిపించడం లక్ష్యాలుగా ఏర్పడిన తొలి యువజన సంఘం ఏఐవైఎఫ్ అని పేర్కొన్నారు. భారతదేశ యువత ప్రస్తుతం తీవ్రమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్మాణాత్మక సంక్షోభమని అన్నారు.

ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువత హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత సమస్యల పరిష్కారం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును కాపాడే అత్యవసర కర్తవ్యమని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, శేఖర్, నదీమ్, సాయిలు, ప్రతాప్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 318 మందిపై కేసులు

**ముద్ర, మల్కాజిగిరి:**

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. గత వారం ఏప్రిల్ 26 నుంచి మే 2 వరకు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 318 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వీరందరినీ పోలీసులు న్యాయస్థానం ముందు హాజరు పరచనున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టుబడిన వారిలో అత్యధికులు ద్విచక్ర వాహనదారులే ఉన్నారు. మొత్తం 271 మంది ద్విచక్ర వాహనదారులు, 37 మంది కార్ డ్రైవర్లు, 10 మంది ఆటో డ్రైవర్లు తనిఖీల్లో చిక్కారు. మద్యం మోతాదు పరీక్షల్లో ఐదుగురు 300 మిల్లీగ్రాములకు పైగా, మరో 18 మంది 200 మిల్లీగ్రాములకు పైగా నమోదై ప్రమాదకర స్థాయిలో మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు పోలీసులు గుర్తించారు.

ఈ సందర్భంగా మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ కె. రాహుల్ రెడ్డి మాట్లాడుతూ, మద్యం మత్తులో వాహనం నడిపి ఎవరి మరణానికైనా కారణమైతే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)–2023లోని సెక్షన్ 105 కింద హత్య కాని నేరపూరిత నరహత్య కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ చట్టం ప్రకారం నిందితులకు 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. గత వారం కోర్టులో పరిష్కారమైన 282 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో న్యాయమూర్తులు కఠిన తీర్పులు వెలువరించారు. 17 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించగా, 18 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ చేయాలని ఆదే శించారు. మిగిలిన 247 మందికి భారీ జరిమానాలు విధించారు.



## మూడు గడ్డివాములు దగ్ధం

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** కేటిదొడ్డి మండల పరిధిలోని పాగుంట గ్రామంలో ఆదివారం మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గోపాల్, జగ్గప్ప, స్వామి గ్రామ శివారులో పశువుల మేత కోసం మూడు గడ్డివాములు వేసుకున్నారు. సమీప పొలంలో రైతు వరికొయ్యలను కాల్చే క్రమంలో మంటలు చెలరేగి గడ్డివాములకు వ్యాపించి దగ్ధమయ్యాయి. స్థానికులు బిందెలతో నీటిని చల్లి మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. మంటలు పక్కనున్న గడ్డి వాములకు విస్తరించకుండా అదుపుచేశారు. సుమారు రూ. 1.20 లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. సంఘటన స్థలాన్ని కేటిదొడ్డి పోలీసులు పరిశీలించారు.

## వన్యప్రాణులను వేటాడుతున్న ఐదుగురి అరెస్టు

**ముద్ర, డెస్క్:** గోల్కొండ పరిధిలో వన్యప్రాణులను వేటాడుతున్న ఐదుగురు వ్యక్తులను గోల్కొండ పోలీసులతో కలిసి టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు జింకలు, కుందేళ్లు, నెమళ్లను వేటాడుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి 3 ఎయిర్ గన్స్, ఒక పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇప్పటి వరకు 12 జింకలు, 400 కుందేళ్లు, ఒక నెమలిని వేటాడినట్లు పోలీసులు తెలిపారు.

# ఇళ్ల పంపిణీలో నిబంధనల ఉల్లంఘన

**- బీఆర్ఎస్ వి జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు**



**తాండూరు, ముద్ర ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో బీఆర్ఎస్వి జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు పలు ఆరోపణలు చేశారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులతో లక్కీ డ్రా నిర్వహించి ఇళ్లను కేటాయించడం ప్రజలను మభ్య పెట్టడమేనని ఆయన విమర్శించారు. ప్రభుత్వ ఇళ్ల పంపిణీ ప్రక్రియను మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా, ఎటువంటి అధికారిక హోదా లేని వ్యక్తి చేత లక్కీ డ్రా తీయించడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ముజీబ్ ఖాన్ అనే వ్యక్తి ద్వారా డ్రా నిర్వహించడం వెనుక ఉద్దేశం ఏమిటో వెల్లడించాలని ఆయన ప్రశ్నించారు. ఆయన మున్సిపల్ కౌన్సిలరా లేదా ప్రభుత్వ అధికారి అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఈ ప్రక్రియను ఉపయోగించారని ఆరోపించారు.

ఇంత పెద్ద స్థాయిలో ఇళ్ల పంపిణీ జరుగుతున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు గైర్హాజరు కావడం అనేక సందేహాలకు దారి తీస్తోందని తెలిపారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే తమకు అనుకూలంగా ఉన్నవారికి ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించారు. లక్కీ డ్రాలో ఎంపికైన వారి వివరాలను పరిశీలిస్తే, ఇతర వర్గాలకు చెందిన పేదలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల పేదల కోసం ఇళ్లు నిర్మిస్తుంటే, ఇక్కడ మాత్రం ఒక వర్గానికే ప్రాధాన్యమిస్తున్నట్లు కనిపిస్తోందని దత్తాత్రేయ రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రజాప్రతినిధుల మౌనం కూడా అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి కులమతాలకు అతీతంగా నిజమైన అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

# నీట్ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత



**–పరిశీలించిన ఎస్పీ టి. శ్రీనివాసరావు**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** నీట్ పరీక్షల సందర్భంగా ఆదివారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని, భద్రత ఏర్పాట్లను ఎస్పీ టి. శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణకు నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రతను కల్పించినట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్ 163 అమలులో ఉంటుందన్నారు.

పరీక్షా సామాగ్రి, ప్రశ్నాపత్రాల తరలింపులో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు ముందస్తుగా ప్రత్యేక ట్రాఫిక్ చర్యలు తీసుకుని, అదనపు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్ , గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, ఇతర పోలీస్ అధికారులు, పరీక్ష నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

# రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**- తాండూర్ శాసనసభ్యుడు బుయ్యని మనోహర్ రెడ్డి**

**ముద్ర, తాండూర్:**

రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తాండూర్ నియోజకవర్గంలోని పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దారసింగ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, రాష్ట్ర టిపిసి




మైనార్టీ డిపార్ట్ మెంట్ నాయకుడు రియాజ్, పార్టీ సీనియర్ నాయకుడు జితేందర్ రెడ్డి, డివై నర్సింహులు, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## కారు బీభత్సం..

**ముద్ర, డెస్క్:** హైదరాబాద్ కమిషనరేట్ పరిధి మీర్‌పేట్‌లో ఓ కారు బీభత్సం సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మే 1న గాయత్రి నగర్ నుంచి ఎల్బీనగర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తండ్రీకొడుకులను కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. ప్రమాదం అనంతరం వాగ్వాదం చోటు చేసుకోగా.. కారులో ఉన్న వ్యక్తి ద్విచక్ర వాహనదారుడిపై దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా.. తండ్రి జిలానీ కారు ఆపేందుకు ప్రయత్నించాడు. అతడు బానెట్‌పై ఉండగానే.. కారు ఆపకుండా డ్రైవర్ సుమారు 2 కి.మీ మేర లాక్కెళ్లాడు. మందమల్లమ్మ చౌరస్తా వద్ద పలువురు అడ్డుకోవడంతో బాధితుడిని వదిలి పరారయ్యాడు. ప్రమాదంలో జిలానీ కుమారుడు ఫైజల్ తీవ్రంగా గాయపడగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 04.05.2026
www.mudranews.in | @mudranews



**ఈతపండ్లు:**



ఎముకలు బలపడతాయి
క్యాల్షియం ఉండటం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది.
పిల్లలు, వృద్ధులకు ఎంతో ఉపయోగకరం.

# తెలంగాణపై కేంద్రం చిన్నచూపు

## - ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
తెలంగాణ రాష్టానికి నిధుల మంజూరులో కేంద్రం చిన్నచూపు చూస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆరోపించారు. జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సఫాయి కార్మికుడు లక్ష్మణ్ కు మేడే వేడుకలలో ఉత్తమ కార్మికునిగా ప్రశంసా పత్రం రాగా, ప్రత్యేకంగా ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ లు గ్రామాలకు సచివాలయాలని, కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యం తో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, గ్రామ పంచాయతీ ల నిర్మాణం తో ప్రజలకు పరిపాలన సౌలభ్యంగా ఉంటుందని అన్నారు. ఎఫ్ సిఐ ధాన్యం తరలించడం లో జాప్యం కారణంగా నేడు రైతులకు కష్టాలు ఎదుర్కొంటు న్నారన్నారు. రైస్ మిల్లుల గోదాంల నుండి వరి ధాన్యం తరలించే విధంగా కేంద్రం చర్యలు చేపట్టాలన్నారు. అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కన్నాపూర్ లో వడ్ల కొనుగోలు కేంద్రం కోసం స్థలం గుర్తింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసీ ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మెన్ లు కొలుగురి దామోదర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, సర్పంచ్ పొట్టవతిని సతీష్, ఉప సర్పంచ్ ప్రశాంత్, సీనియర్ నాయకులు బాల ముకుందం, మండల సర్పంచుల ఫోరమ్ కట్ట రాజేందర్, డిఈ మిలింద్, ఎమ్మార్వో హకీమ్, ఎంపివో రవి బాబు, ఏఈ రాజమల్లయ్య, ఆర్ ఐ భూమయ్య మాజీ సర్పంచ్ బొడ్డు దామోదర్ , శేఖర్ రావు, నాగిరెడ్డి గంగారెడ్డి, మాజీ ఎంపిటిసి భూమా రెడ్డి, ఉప సర్పంచ్ ముద్దం మల్లేశం, మీస వేణు, శివ, నాయకులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 10వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో భారత ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభ సందర్భంగా ఆదివారం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నాయకులకు దిశ నిర్దేశం చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేందర్ రెడ్డి, జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ బోగ శ్రావణి తదితరులతో పాటు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుంచి డివిజన్ స్థాయిలో ప్రజావాణి

## - కలెక్టర్ భవేష్ మిశ్రా



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ఇకపై డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు ఆదివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.ఈ మేరకు ఒక ప్రకటన విడు దల చేశారు. ఇందులో భాగంగా సోమవారం నుండి నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం, భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రజావాణితో పాటు, ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందువల్ల దూరభారం కూడా తగ్గనుందని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా కేంద్రానికి రాలేని మారుమూల గ్రామాల ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే విన్నవించుకునే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. భూ భారతి, భూ వివాదాలు, విద్యా, వైద్యం, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర పౌర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. అందిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# ప్రశాంతంగా నీట్ పరీక్ష



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
జగిత్యాల జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీటి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మూడు నీట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో జగిత్యాల పట్టణంలోని ఎస్ కె ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొండగట్టు వద్దగల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు నీట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన నీట్ పరీక్ష కోసం జిల్లాలోని మూడు సెంటర్లలో మొత్తం 796 మంది విద్యార్థులను కేటాయించగా, ఇందులో 781 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 15 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదని అధికారులు తెలిపారు.

**పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్**

జగిత్యాల పట్టణంలోని ఎస్ కె ఎన్ ఆర్ డిగ్రీ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ ప రీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) బి. ఎస్ లత పరిశీలించి, నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలోని గదుల అమరిక, సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్ష నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ఎటువంటి లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. అదేవిధంగా, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి కె. రాము, డిఎంహెచ్ వో సుజాత, ఎస్ కె ఎన్ ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్ మోహన్, విద్యాశాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ యార్డుల్లో జొన్న కొనుగోలు కేంద్రాలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస మద్దతు ధర క్వింటాల్ కి రూ. 3699 లు ఉందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటలను విక్రయించాలని సూచించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొన్నారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో ఒక వైపు చేతికొచ్చిన పంట నష్టం వాటిల్లితే, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేసి, ఈ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. పంట నాణ్యతను పక్కనపెట్టి అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు,రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వందెకరాల మొక్కజొన్న పంటకు అగ్ని ప్రమాదం



**బోథ్, ముద్ర:**
అరుకాలం శ్రమించి పండించిన పంట మరికొద్ది రోజుల్లో ఇంటికి చేరుతుందనుకున్న రైతన్నల ఆశలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కనుగుట్ట శివారు ప్రాంతంలోనీ ఆదివారం సుమారు 100 ఎకరాల మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదానికి కాలి బూడిద అయింది. నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి ఎన్నో ఆశలతో పండించిన పంట కళ్ళ ముందే కాలిపోతుంటే రైతులు నిస్సహాయంగా కన్నీరు మున్నిరవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతకు తోడు బలమైన గాలులు అగ్ని ప్రమా ద తీవ్రతను అంతకంతకు పెంచుతున్నాయి. ఒక చోట ప్రారంభమైన మంటలు వేగంగా విస్తున్న గాలుల కారణంగా నిమిషాల వ్యవధిలోనే పక్కనున్న పంట పొలాలకు వ్యాపిస్తున్నాయి. బోథ్ మండల కేంద్రంలో ఫైర్ ఇంజిన్ లేకపోవడం కూడా ప్రమాద తీవ్రతకు కారణం అవుతుంది. బోథ్ కు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇచ్చోడ నుండి ఫైర్ ఇంజన్ ప్రమాద స్థలానికి వచ్చేలోగానే పంట కాలి బూడిద అవుతుంది. ప్రమాదవశాత్తు సంభవిస్తున్న ఈ మంటల కారణంగా పంట కాలిపోవడమే కాకుండా వ్యవసాయ క్షేత్రాల్లో నిల్వ ఉంచిన పైపులు, ఇతర వ్యవసాయ సామాగ్రి, వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లు సైతం కాలి బూడిద అవుతుండడంతో రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నాయి. ఇటీవల కాలంలో బోథ్ ప్రాంతంలో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ ఆశించిన స్థాయిలో స్పందించడం లేదనే విమర్శలు రైతుల నుండి వ్యక్తం అవుతున్నాయి. అగ్ని ప్రమాదాల కారణంగా సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం



**ముద్ర, కోరుట్ల:** మెట్ పల్లి పట్టణం లోని ఇందిరానగర్ లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి నర్సింగరావు గృహప్రవేశానికి హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా ఇల్లు లేకుండా ఉండకూడదు అనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకాన్ని చేపట్టారని నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణమే తమ ధ్యేయమని జువ్వాడి నర్సింగరావు స్పష్టం చేశారు. అనంతరం లబ్ధిదారులు జువ్వాడి నీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ ఛైర్మెన్ మున్సిపల్ కౌన్సిలర్ లు, పార్టీ వివిధ హోదా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీతారామచంద్ర స్వామి రథోత్సవం



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ముత్తారం శ్రీ సీతారామచంద్ర స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. ఆలయం చుట్టూ స్వామివారి రథోత్సవం నిర్వహించగా.. భక్తుల గోవింద నామస్మరణలతో పులకించిపోయారు. ఎరడపల్లి, ముత్తారం గ్రామాలతోపాటు చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ రూరల్ మండలం మూటాపూర్, అక్కాపూర్ లలో వరి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులు దళారులను ఆశ్రయిం చకుండా నేరుగా మార్కెట్ కమిటీ లో విక్రయించాలని సూచించారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# దుబాయ్ లో కోరుట్ల వాసి గుండె పోటు తో మృతి



**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని బీసీ కాలనీ (అల్లమయ్య గుట్ట) ప్రాంతంలో నివాసం ఉంటున్న పోతారం గ్రామానికి చెందిన దుబాయిలో గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుబాయ్ లోని సి ఆర్ సి కంపెనీ లో బిల్డింగ్ కన్స్ట్రక్షన్ లేబర్ గా పని చేస్తున్న మృతుడు వాసాల రవి ఆదివారం రాత్రి పడుకొని సోమవారం నిద్ర లేవకపోవడంతో డ్యూటీకి వెళ్లేందుకు సిద్ధమైన సహచరులు గమనించి క్యాంప్ సెక్యూరిటీ వారికి సమాచారం అందించగా వారు ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. దుబాయ్ లో మృతిచెందిన వాసాల రవి మృతదేహాన్ని భారతదేశానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. కంపెనీ అధికారులు ఇంకా రెండు, మూడు రోజులు పట్టొచ్చని చెప్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 04.05.2026
www.mudranews.in | @mudranews



**ఈతపండ్లు :**

హార్ట్ హెల్త్‌కు మంచిదిచెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయ పడుతుంది.గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

# అకాల వర్షం.. అన్నదాత ఆగమాగం

**తుంగతుర్తి లో ఈదురు గాలులు వడగండ్ల వర్షం ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం విరిగిన చెట్లు**





**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి మండల వ్యాప్తంగా ఆదివారం ఈదురు గాలులతో పాటు కురిసిన అకాల వర్షం అన్నదాతను నిండా ముంచింది. మండలంలో ఈదురుగాలులు, వడగండ్ల తో కూడిన వర్షానికి రైతన్న ఆరుగాలం చేసిన కష్టం ఒక్క వానతో పలు గ్రామాల్లోని ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి ఉంచిన ధాన్యం తడిసింది. ధాన్యాన్ని వర్షం బారి నుండి కాపాడుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడ్డారు, పలు గ్రామాల్లో రైతులు ఐకెపి కేంద్రాల్లో ఆరబోసుకున్న ధాన్యం వర్షపు నీటిలో కొట్టుక పోయింది. నిర్వాహకులు వద్దు వర్షానికి తడవకుండా తార్పాలు ఏర్పాటు చేయక పోవడంతో రైతులు వర్షం బారి నుండి తమ ధాన్యాన్ని కాపాడుకోవ డానికి చాలా ఇబ్బందులు పడ్డారు.కొనుగోలు కేంద్రాల్లో సర్కారు, నిర్వాహకుల నిర్లక్ష్యంతో కాంటాలు సమయానికి కాకపోవడంతో ధాన్యం తడిసిపోయిందని రైతుల ఆరోపిస్తున్నారు రైతులు ఎంతో కష్టపడి పండించిన పంట ఈ విధంగా నష్టపోవడం తో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం,అధికారులు సరైన కవర్లు, గోదాములు ఏర్పాటు చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు . అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా మామిడి తోటల రైతులు భారీ గాలి దివారానికి చేతికి వచ్చే పంట నేలరాలడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మామిడి కాయలు తెంపి మార్కెట్ చేసే దశలో ఆదివారం ప్రకృతి సృష్టించిన బీభత్సానికి కాయలన్నీ నేలరాలి రైతులను భారీ నష్టానికి గురిచే సిందని చెప్పవచ్చు. మామిడి తోటలకు ఈ ఏడాది ఇప్పటివరకు గాలి దుమారాలు రాక రైతులు ఈసారి కొంతమేర లాభం వస్తుందని ఆశించి మార్కెట్ శేషు కుందామన్న సమయంలో వచ్చిన గాలి దుమారం రాళ్ల వర్షంతో కాయలు నేలరాలి రైతులకు నష్టం కలిగిం చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు స్పందించి జరిగిన నష్టాన్ని పరిశీలించి రైతులకు ఆర్థిక సహాయం అందించాలని మామిడి తోటల యాజమాన్యాలు కోరుతున్నాయి. భారీ ఈదురుగాలులకు మండల పరిధిలోని వెంపటి గ్రామంలో రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగిపడడం తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా ఎండల తీవ్రతకు కురిసిన వర్షానికి ప్రజలకు ఉపశమనం కలిగింది, వేడి తగ్గి వాతావరణం చల్ల బడటంతో ప్రజలు కొంత ఊరట పొందారు.

## వైభవంగా కళ్యాణం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా చేశారు. శ్రీ సుదర్శన నారసింహ హవనం గావించారు.సాయంత్రం ఆలయ మాడ వీధులలో భక్తుల గోవింద నామస్మర ణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను నిర్వహించి దేదీప్య మానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.

## రాష్ట్ర ప్రభుత్వం మక్కలు కొనాలి



**ముద్ర, జయశంకర్ భూపాలపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మక్కల కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. జయ శంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో నిర్వహించే రైతుసదస్సు కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. రేగొండ మండలం కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, వెంటనే మక్కలను మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవా లన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టి ప్రభుత్వం మేడలు వంచి రైతులకు న్యాయం చేకూరేలా కార్యాచరణ చేపడ తామని హెచ్చరించారు.

**వర్ధన్నపేట మండలంలో..**
వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇ ల్లంద వద్ద జాతీయ రహదారిపై మాజీ ఎమ్మె ల్యే అరూరి ఆధ్వర్యంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకొని అరూరి రమేశ్‌తో పా టు బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి రాస్తారోకోను విరమింపజేశారు. నల్లబెల్లిలోని సొసైటీ కార్యాల యాన్ని రైతులు దిగ్బంధించా రు. కాంటా పెట్టిన మక్కలను గోదాము లకు తరలించలేదని, 20 రోజుల నుంచి అవస్థ పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వాహనాలు సమకూర్చేందు కు సొసైటీ సిబ్బంది లంచం తీసుకుంటు న్నారని ఆరోపించారు. సంగెం మండ లం తీగరాజుపల్లి శివారులోని భాగ్యన గర్ వేబ్రిడ్జి వద్ద రాస్తారోకో చేశారు. పర్వతగిరి మండలం చౌటపల్లి, ఏనుగల్లు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు సంగెం, పర్వతగిరి మం డలాల్లోని పలు గ్రామాల నుంచి రైతులు మక్కలను తీసుకొచ్చి వేబ్రిడ్జి వద్ద కాంటా వేయించారు. అక్కడి నుంచి కొంకపా కలోని గోదాముకు వచ్చి హమాలీలు లేకపోవడంతో గురిజాల క్రాస్‌రోడ్డు వద్ద రైతులతో రాస్తారోకో నిర్వహించారు. ర

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా ట్రేడ్ చేసి లక్షల్లో దోపిడీ చేస్తున్న మిల్లర్లు**
**మార్కెట్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి**
**వడపర్తి ఐకెపి కేంద్రాన్ని సందర్శించిన రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ఐకెపి, పిఎసిఎస్, ఎఫ్ సి ఐ ధాన్యం కొనుగోళ్ళ లో వేగం పెంచాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ డిమాండ్ చేశారు. భువనగిరి మండలం వడపర్తి ఐకెపి కేంద్రాన్ని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించి రైతులతో మాట్లాడిన మస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ మిల్లర్లు ఏ గ్రేడ్ ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత మిల్లుకు పోయినంక బి గ్రేడ్ గా ట్రేడ్ చేసి లక్షలాది రూపాయలు రైతాంగం నుండి దోపిడీ చేస్తున్నారని వెంటనే ఈ దోపిడీని అరికట్టాలని కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జోక్యం చేసుకొని రైతులకు జరిగే నష్టాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక ఎండ వేడిమికి తాళలేక వడదెబ్బ గురువుతున్న రైతులను పట్టించుకునే నాధుడే కరువ య్యాడని అన్నారు. ఐకెపి, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి మే 15 నాటికి పూర్తి చేయాలని ఇప్పటికే వాతావరణ శాఖ రుతు పవనాలు ముందుగానే వస్తాయని హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. వడపర్తి ఐకెపి వద్ద 145 మంది రైతులు గత 25 రోజులుగా మార్కెట్ కు ధాన్యంతేగా ఇప్పటివరకు 30 మంది రైతుల మాత్రమే లోడింగ్ జరిగిందని ఇంకా రైతాంగం వరి కోతలని ముమ్మరం చేసి మార్కెట్ కు తెచ్చే అవకాశం అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పొండాల మైసయ్య, మెరుగు ఈశ్వరయ్య సింగం కృష్ణవేణి, ఎలిమినేటి సంతోష్ రెడ్డి, మన్నే నరేందర్ రెడ్డి, బబ్బులి భగవంతు రెడ్డి,అవిశెట్టి రామకృష్ణ, ఎలిమినేటి సురేష్ రెడ్డి, తోటకూరి శ్రీశైలం, ఎర్రబోయిన కృష్ణ, పాల్గొన్నారు

## దేశం సుఖశాంతులతో ఉండాలంటే హిందుత్వం బలపడాలి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** దేశంలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటే హిందుత్వం బలపడాలని శ్రీ శాంభవి పీఠాధిపతి శ్రీనివాస్ శర్మ అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని సావర్కర్ చౌరస్తా వద్ద ఆర్ఎస్ఎస్ ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ హిందువు తన కులాన్ని మరిచి ఈ దేశంలో ఉన్న ప్రజలందరూ హిందూ సహోదరులు వలె భావించాలని ఆ విధంగా ప్రతి హిందువు అనుకున్నట్లయితే మన దేశంలో ఉన్నటువంటి హిందూ సంస్కృతిని హిందూ సాంప్రదాయాలను మన దేవాలయాలను గోవులను హిందూ మహిళలను రక్షించు కోవచ్చు అని తెలిపారు. ప్రకృతితో అనుసంధానమై జీవించేటువంటి తత్వమే హిందుత్వం ఈ దేశం కోసం ఆలోచించాలని ఆ విధంగా ఆలోచించినప్పుడే ఈ దేశం ప్రపంచంలో జగద్గురు స్థానానికి వెళుతుందని ప్రపంచానికి మార్గదర్శనం చేయాలంటే హిందూ సమాజ సంఘటన జరిగి తీరాల్సిందేనని అప్పుడే ఈ దేశం హిందూ దేశంగా గుర్తించబడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా వక్త ప్రణీత, రాష్ట్రీయ వికాసమితి ప్రముఖకరకాల సుదర్శన్, దొంత లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎంకే శ్రీధర్, తాడెం పాండు, మాయ దశరథ, పడమటి జగన్మోహన్ రెడ్డి, కంబాలపల్లి కృష్ణయ్య, ఆర్ఎస్ఎస్ నాయకులు బాదం ప్రకాష్, జిల్లా సంఘ చాలక్, పూల శ్రీనివాస్, రత్నపురం శ్రీశైలం, బచ్చు నరేందర్, ఎడవల్లి ఎడవల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** నిరుద్యోగ సంక్షోభం పై సమగ్ర విధాన మార్పులు అవసరమని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బూర సైదులు ఎడెల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవంను పోరాట దినంగా పరిగణిస్తూ ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్మ బిక్షం భవన్ వద్ద ఏర్పాటు చేసిన యువజన సంఘ జెండాను మాజీ నాయకులు బొమ్మ గాని శ్రీనివాస్ ఎగురవేశారుఈ సందర్భంగా ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ 1959 మే 3 న ఆవిర్భవించిందని, న్యూఢిల్లీలో జరిగిన ఆవిర్భావ మహాసభలో 11 రాష్ట్రాల నుండి 250కి పైగా ప్రతినిధులు, పరిశీలకులు పాల్గొన్నారని ఆరు రోజులపాటు జరిగిన ఈ చారిత్రాత్మక సమావేశంలో అధికారికంగా ఏఐవైఎఫ్ ఏర్పాటును ప్రకటించారన్నారు ఈ మహాసభలో సామ్యవాద ఆలోచనలను వ్యాప్తి చేయడం, యువతను సామాజిక మార్పు దిశగా నడిపించడం ప్రధాన లక్ష్యాలుగా ఏర్పడిన మొదటి యువజన సంఘం ఏఐవైఎఫ్ అని అన్నారు. భారతదేశ యువత ఈరోజు తీవ్రమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదని ఇది దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్మాణాత్మక సంక్షోభమన్నారు .కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు పరిశీలిస్తే ప్రభుత్వ నియామకాలు తగ్గించబడుతున్నాయని, ప్రైవేటీకరణ వేగవంతమవుతోందని, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరుగుతున్నాయని, విద్య ఖర్చులు పెరిగి యువతపై భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలు యువతను అస్థిరతలోకి నెట్టుతున్నాయన్నారు. ఉపాధి రంగంలో జాతీయ స్థాయిలో భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ ఖాళీలను నిర్దిష్ట సమయంలో భర్తీ చేయాలని, విద్య రంగంలో ఉచిత, నాణ్యమైన ఉన్నత విద్య, ఫీజుల నియంత్రణ అవసరమన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతు ఇస్తూ గ్రామీణ ఉపాధి అవకాశాల పెంపుదల చేయాలని అన్నారు. యువత సంక్షేమం కోసం నిరుద్యోగ భృతి, మెంటల్ హెల్త్ సపోర్ట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఏ ఐ వై ఎఫ్ మాజీ నాయకులు బొమ్మ గాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేశ యువతకు హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తుందన్నారు. యువత సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది దేశ భవిష్యత్తును కాపాడే అత్యవసర కర్తవ్యమని ఉద్ఘటించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్ కుమార్, నీలా శ్రీనివాస్, ఏఐవైఎఫ్ పట్టణ గౌరవ అధ్యక్షులు కుక్కడప్పు శౌరి, కప్పల రాము, బీసు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** నీట్ పరీక్షల సందర్భంగా సూర్యాపేట పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా కళాశాలల నందు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్త్ ఏర్పాట్లను జిల్లా ఎస్పి నరసింహ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ ఏజన్సీ నిభందనల ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రత కల్పించాము, పరీక్ష సామాగ్రి పత్రాల తరలింపులో అధికారులతో సమన్వయం చేసుకుని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు" తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకు ముందస్తుగా ప్రత్యేక ట్రాఫిక్ చర్యలు తీసుకున్నాం, ప్రత్యేక సిబ్బందిని నియమించామని చెప్పారు.ఎస్పీ వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, పరీక్ష నిర్వహణ అధికారులు ఉన్నారు.

## జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ఈనెల 18, 19 తేదీలలో రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని చీమలకొండూరు గ్రామంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా అనేక కూలీ, భూమి, ఉపాధి, సంక్షేమం, విద్య, వైద్యం, కూలీ పేటలో అభివృద్ధిపై నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తూ వ్యవసాయ కూలీలకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం నిలిచిందని తెలిపారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ భూమిలేని ప్రతి పేదవాడికి ప్రభుత్వ భూములు పంచాలని కోరుతూ అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి లక్షల ఎకరాల భూములను దేశవ్యాప్తంగా పంచిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉన్నదన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీని రద్దు చేయడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తుందని, ఆ కుట్రలను నిరంతరం కూలీలను సమీకరించి తిప్పి కొడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, చీమల కొండూరు గ్రామ సర్పంచ్ పల్లెర్ల అంజయ్య, నాయకులు బోడ ఆంజనేయులు, పల్లెర్ల ఉప్పలయ్య, చంద్రయ్య, రచ్చ వెంకటేష్, నారికాడపు శంకర్, మాదాన్ జోజి, బల్గరాజు, కరికి మల్లేష్, రావుల నాగరాజు, కడగంచి సతీష్, మంగ సత్తయ్య, అంగడి భాస్కర్, పసుల మరిదాస్, డొమినిక్, అంతోని పాల్గొన్నారు.

## శ్రీ కంఠమహేశ్వర స్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండలం సురేపల్లి గ్రామంలో శ్రీ కంఠ మహేశ్వర స్వామి పండుగకు భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, గ్రామ సర్పంచ్ కొండూరు దానమ్మ సత్యనారాయణ గౌడ్, గోద శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సందెల సుధాకర్, అబ్బగాని వెంకటేష్ గౌడ్, చిందం మల్లికార్జున్, సర్పంచ్ కటికే జంగయ్య యాదవ్, నోముల మహేందర్ రెడ్డి, బొమ్మరపు సురేష్, కునూర్ అంజయ్య గౌడ్, మందుగాని వేణు, మూడవత్ శ్రీనివాస్ నాయక్, మొగవత్ నర్సింహా నాయాక్, వల్య, శంకర్ పాల్గొన్నారు

## భూములు, బుల్డోజర్ల చుట్టూ రేవంత్ రెడ్డి పాలన



**ముద్ర, వరంగల్:** రేవంత్ రెడ్డి పాలన భూముల చుట్టు, బుల్డోజర్ల చుట్టే సాగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్ రెడ్డి , స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య విమర్శించారు. ఆదివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్, వేలేరు మండలాలలోని ఐకేపీ, పీఏసీఎస్, మార్క్ ఫెడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తే నెల రోజులైన ధాన్యం విక్రయించలేని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండున్నరేండ్ల పాలనలో రైతులు ఒక్కరోజు కూడా సంతోషంగా లేరని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూములను నమ్ముకుని బ్రతికేటోడు కాదని భూములను అమ్ముకుని బ్రతికేటోడని రైతులకు అర్థమైందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ఖజానాను దోచుకుంటున్నట్లు ఆరోపించారు. కడియంది ఐరన్ లేగ్ అని ఆయన ఎక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే అక్కడ కేంద్రాలే మూతపడ్డాయని రాజయ్య ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ కరువు వస్తుందని, రైతులకు కన్నీళ్లు, కష్టాలు వస్తాయని కేసీఆర్ చెప్పినట్లే మళ్లీ కరువు వచ్చిందన్నారు. ఈనెల 6న హనుమకొండలో నిర్వహించే రైతు సదస్సుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, ధర్మసాగర్ మండల ఇన్‌చార్జి కర్ర సోమిరెడ్డి, మండల కన్వీనర్ కొయ్యడ మహేందర్, నాయకులు చాడ విజేందర్ రెడ్డి, మారబోయిన రాజు, ప్రవీణ్, సాగర్, వెంకన్న, ఎండీ హరీఫ్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 04.05.2026
www.mudranews.in | @mudranews



**ఈతపండ్లు:**

ఇమ్యూనిటీ పెంచుతుంది
రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు ఉన్నాయి.
శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షిస్తుంది.



# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**- ఎమ్మెల్యే హరీశ్ రావు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫమైందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట–కరీంనగర్ రాజీవ్ రహదారిపై మల్లారం వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు లు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే హరీష్ రావు సంఘీభావం తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.

పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారం భించారు, కానీ ఒక్క గింజ కూడా ప్రభుత్వం కొనడం లేదన్నారు. 28 రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదంటూ రైతులు తన దృష్టికి తెచ్చారన్నారు. మొక్కజొన్న రైతులకు గన్ని బ్యాగులు లేకపోతే రైతులు సొంతంగా బ్యాగులు తెచ్చుకుంటున్నారని 22 రోజులుగా సన్ ఫ్లవర్ గింజలను కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. మొక్కజొన్న శనిగలు వడ్లు పండించిన రైతులు బాధ పడుతున్నారు ప్రభుత్వం వారిని గోసపెడుతోందన్నారు.ప్రభుత్వం వెంటనే కలెక్టర్లకు ఆర్డర్ ఇచ్చి వడ్ల కొనుగోలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నిబంధన పేరుతో రైతులను వేధిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లకు బోనస్ ఇస్తామన్నారు బోనస్ బోగస్ అయింది రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఎరువులు కొనాలంటే ఆప్ కావాలి వడ్లు కొనాలంటే ఆన్లైన్ కావాలి అంటూ రైతులను ఇబ్బంది పెడుతుందనిఆయన దుయ్యబట్టారు.

## కామారెడ్డిలో అగ్ని ప్రమాదం

**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డిలోని పాత బస్టాండ్ వద్ద అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బస్టాండ్ వద్ద ఉన్న 12 షాపులు అగ్నికి ఆహుతయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారామిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌లతో మంటలను అదుపు చేశారు. ప్రాణ నష్టం జరగనట్టు సమా చారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఔటర్ రింగ్ రోడ్ పై రోడ్డు ప్రమాదం..

**ముద్ర, హైదరాబాద్:** సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ ఔటర్ రింగ్ రోడ్‌పై ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కారు డివైడర్‌ను ఢీకొని, కరీంనగర్‌కు వెళ్తున్న లారీ ని ఢీకొడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విష మంగా ఉంది. పోలీసులు అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది .

## జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

**ముద్ర, హైదరాబాద్:** తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నిరుద్యోగులను ఏకం చేసి సెక్రటేరియట్ ముట్టడిస్తామన్నారు. తక్షణమే నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గ్రంథాలయంలో ఉద్యోగాలకు ఎలా ప్రిపరేషన్ అవుతున్నారని నిరుద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు, యువ త ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ధర్నాలు చేస్తుంటే, సీఎం రేవంత్ యువతే నోటిఫికేషన్లు వద్దంటుందని బుకాయిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మొదటి ఏడాదే 2లక్షల ఉద్యోగాలు అంటూ నమ్మబలికారన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి నాడు నమ్మించారు..నేడు వంచించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీచేశామని గుర్తుచేశారు. మిగి లిన వాటికీ కాయితాలు పంచి రేవంత్‌రెడ్డి ఖాతా లో వేసుకున్నాడన్నారు. పోలీస్‌శాఖలో 19 వేల ఖాళీలు ఉన్నాయని డీజీపీ స్వయంగా చెప్పారన్నారు. మరి ఎందు కు ఆ పోస్టులకు నోటిఫికేషన్లు ఇస్తలేరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో 40వేల పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు.

# ప్రశాంతంగా నీట్ పరీక్ష



సిద్దిపేటలో ప రీక్షా కేంద్రాన్ని పరిశీస్తున్న కలెక్టర్



మెద క్ లో ప రీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలో నీట్– 2026 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిందన్నారు . మొత్తం 937 మంది అభ్యర్థులకు గాను 916 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు.21 మంది గైర్ హాజరయ్యారన్నారు . జిల్లా కలెక్టర్ పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో నీట్ పరీక్షను జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. రెండు పరీక్ష కేంద్రాలలో సిద్దిపేట ఆర్డీఓ నేతృత్వంలోని, పగడ్బందిగా పోలీస్ సెక్యూరిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష విజయవంతంగా ముగిసిందని పరీక్ష నిర్వహణలో పాల్గొన్న అధికారులకు అందరికీ కలెక్టర్ అభినందనలు తెలిపారు.

### మెదక్ లో..

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు తెలుసుకున్నారు. పరీక్షకు మొత్తం 479 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 465 మంది హాజరయ్యారు, 14 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాల నిఘాతోపాటు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వెంట తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ కేంద్రం దర్శించారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ముద్ర, హైదరాబాద్:** ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభు త్వంలో గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, ఆనాడు కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధే నేడు కనిపిస్తున్నదని, రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలు మోసపోయాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని అక్కా రం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రేవంత్‌రెడ్డి ప్రభు త్వం కాలయాపన చేస్తున్నదని, ఎంతో ఆశలో



ఓట్లేసిన ప్రజలను మోసం చేసి ఇచ్చిన హామీలు విస్మరించారన్నారు.బీఆర్ఎస్ హయాంలోనే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాయని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకుండా దాటవేస్తున్నదన్నారు. గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై కొద్ది కాలం లోనే విరక్తి చెందారని, కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని ప్రజలు కూడా గ్రహించారన్నారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో సింగర్ ఎల్లంతో పాటు పలువురు ఉన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పాల్గొన్నారు.

# బ్యాటరీ పేలి విద్యార్థికి గాయాలు..

**ముద్ర, హైదరాబాద్:** మెదక్ జిల్లా శివంపేట మండల కేంద్రంలో విషాదఘటన చోటు చేసుకుంది. నాలుగవ తరగతి చదువుతున్న రాజిపేట శివతేజ్ అనే విద్యార్థి ఓ దుకాణంలో ఎండాకాలం దృష్ట్యా చేతిలో పట్టుకునే చిన్న ఫ్యాన్ కలిగిన బ్యాటరీ కొనుగోలు చేశాడు.ఆ బ్యాటరీను ఉపయో గిస్తున్న సమయంలో అకస్మాత్తుగా పేలుడు ధాటికి ఏకంగా ఎడమ చేతి నాలుగు వేళ్లు తెగి తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని కుటుంబ సభ్యులు వెంటనే కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిం చారు. నాణ్యత లేని బ్యాటరీల విక్రయంపై పర్యవేక్షణ అవసరమని కోరుతున్నారు.

# జక్కన్నపేటలో వైభవంగా రథోత్సవం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** హవేళీఘనాపూర్ మండలం జక్కన్నపేటలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంతి జాతర ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి నామస్మరణతో పరవశించిపోయారు. ఆలయ ధర్మకర్త విట్టల్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, వతన్‌దారులు రథాన్ని సుందరంగా అలంకరించారు. గ్రామస్థులు, యువకులు, భక్తులు రథాన్ని లాగారు. సర్పంచ్ సత్యనారాయణ, టి యూ డబ్ల్యూ జె జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి నాయకులు శ్రీనివాస్ గౌడ్, ముత్యం రాజు పాల్గొన్నారు. ఏఎస్ఐ కిష్టయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి



**ముద్ర, హైదరాబాద్:** ప్రభుత్వం ఎన్నికల హామీలు చేయాలని అమలులో టీజీఈ జేఏసీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఆయన ఎల్లారెడ్డి, బాన్సు వాడలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు.ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. ఈ నేపథ్యంలో టీజీఈ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 5న కామారెడ్డి జిల్లా కేంద్రం లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. మొ త్తం 64 డిమాండ్లలోని ప్రధానమైన నాలుగు డిమాండ్లను మాత్రమే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్న ట్లు తెలిపారు. ఫిట్ మెంట్ ప్రకటించే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బెన్‌ఫిట్స్ ఇప్పటివరకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. రిటైర్డ్ అయిన వారికి, చనిపోయిన వారికి ఇప్పటి వరకు పెన్షన్ రావడంలేదని పేర్కొన్నారు.

### ప్రజాప్రతినిధులకు పెన్షన్ ఎందుకు?

ఉద్యోగస్తులకు పెన్షన్ తొలగించారని, ఉద్యోగులకు అక్కరలేని పెన్షన్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. వారికి ఇచ్చే పెన్షన్‌ను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో అధికారంలోకి వస్తే ఓపీఎస్‌ను అమలుచేస్తామని, పీఆర్సీ ప్రకటిస్తామని, పెండింగ్ బిల్లులు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.

# ఇందిరమ్మ పథకంతో పేదల సొంతింటి కల సాకారం



**ముద్ర, హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని హుస్నాబాద్ డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ జంగపల్లి ఐలయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశనాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ పథకం కింద అక్కన్నపేట మండలంలో 470 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 300లకు పైగా గృహాలు స్లాబు దశ దాటినట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని ఇళ్ల గృహ ప్రవేశాలు కూడా జరిగాయన్నారు. ప్రభుత్వం అన్ని వార్గల వారి అభివృద్ధి కోసం తీవ్రంగా శ్రమిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలోసర్పంచ్ సులోచన, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు బానోతు వెంకటేష్, సర్పంచులు బందారం శ్రీనివాస్, జన్నారపు సంపత్, కాంగ్రెస్ నాయకులు బానోతు సోమా నాయక్, సారయ్య, రవి నాయక్ పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com